# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 147

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 20 జూన్ 2026





జూన్ 20, 21న పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పర్యటన




**సమయం ప్రతినిధి:** హైదరాబాద్, జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు కృతజ్ఞతలు: సీఎం రేవంత్**

మూసీ రిఫర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం కృతజ్ఞతలు తెలియజేశారు. మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




**సమయం ప్రతినిధి:** తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట దక్కింది. అసెంబ్లీలో సీఎం విజయ్ బలపరీక్షపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషన్‌లో పేర్కొన్నవి అస్పష్టమైన ఆరోపణలు మాత్రమేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆరోపణలకు బలం చేకూర్చే ఆధారాలు లేవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. మే 13న అసెంబ్లీ వేదికగా జరిగిన బలపరీక్షలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన తన సంఖ్యా బలాన్ని సీఎం విజయ్ నిరూపించుకున్నారు. వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎమ్ఎల్ పార్టీలు టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు పలికాయి. 25 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా టీవీకే అధినేత విజయ్‌కు అండగా నిలిచారు. డీఎంకే మాత్రం వాకౌట్ చేసింది. ఈ క్రమంలో సీఎంకు సభలో మద్దతు తెలిపిన ఎమ్మెల్యేల సంఖ్య 120కు చేరింది. మేజిక్ ఫిగర్‌కు అదనంగా ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతును సీఎం సాధించారు. అయితే, బలపరీక్షలో అక్రమాలు జరిగాయని ఈ సందర్భంగా ప్రతిపక్షం ఆరోపించింది. ఈ నేపథ్యంలో బలపరీక్షపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణలకు బలం చేకూర్చే ఆధారాలేవీ లేవని సుప్రీం కోర్టు పేర్కొంది.




**సమయం ప్రతినిధి:** నీట్ రీటెస్టుకు సంబంధించి విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తక్షణ విచారణను చేపట్టేందుకు నిరాకరించింది. నీట్ పరీక్ష సంబంధిత పిటిషన్‌లపై జస్టిస్ పీఎస్ నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చెప్పట్టనుందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తాము తక్షణ విచారణ చేపట్టలేమని తేల్చి చెప్పారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ రీటెస్టుపై విద్యార్థుల్లో అనేక ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. టెలిగ్రామ్ నిషేధంపై ఢిల్లీ హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చిన అంశాలు ఆందోళనలోకి నెట్టాయని అన్నారు. పేపర్ లిక్ వంటి అంశాలన్నీ విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయని తెలిపారు. పరీక్ష అడ్మిట్ కార్డులను కొందరు విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోలేకపోయారని కూడా విద్యార్థుల తరఫు న్యాయవాది అన్నారు. మరి కొందరికి తాము ఆశించిన వాటికంటే భిన్నమైన పరీక్ష కేంద్రాల కేటాయింపు జరిగిందని చెప్పారు. పూర్తిస్థాయిలో సంసిద్ధమయ్యేందుకు విద్యార్థులకు తగిన సమయం లేదని అన్నారు. అయితే, ఈ అంశాలపై తాము తక్షణ విచారణ చేపట్టలేమని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నీట్ కేసులకు ఈ పిటిషన్‌ను ట్యాగ్ చేయాలన్న అభ్యర్థన కూడా సాధ్యం కాదన్నారు. ఇలాంటి అంశాలన్నీ జస్టిస్ పీఎస్ నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలిస్తుందని చెప్పారు.

# తెలంగాణకు మూడు బుల్లెట్ రైలు కారిడార్లు

## రూ.87 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**రంగారెడ్డి, సమయం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సుమారు రూ.87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్) రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తిమ్మాపూర్‌తో పాటు కొంగర, రావిరాల, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని ఈ ప్రాంతాలు వేగంగా పట్టణీకరణ దిశగా పయనిస్తున్నాయని, మెరుగైన రహదారి సౌకర్యాలతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయని చెప్పారు.

**మూడు బుల్లెట్ రైలు మార్గాలు**

దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ రైలు ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్--చెన్నై మార్గాల్లో బుల్లెట్ రైళ్లు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.5 లక్షల కోట్లుగా ఉన్నప్పటికీ, భూసేకరణ ఖర్చుల కారణంగా అది రూ.10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్లకు సంబంధించిన సర్వేలు జరుగుతున్నాయని, సర్వేలు మరియు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు పూర్తయిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ఈ మూడు బుల్లెట్ రైలు కారిడార్లు తెలంగాణ అభివృద్ధికి గేమ్‌ఛేంజర్‌గా మారనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే హైదరాబాద్ చుట్టూ మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, దీనికి సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం కీలకమని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో కొన్ని పనులు ఆలస్యమైనప్పటికీ, ఇకపై వాటిని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి: రాజ్‌నాథ్ సింగ్



**సమయం ప్రతినిధి :** భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ప్రపంచ పోటీలో నిలదొక్కుకోవాలంటే సరికొత్త సాంకేతికతలు, అధునాతన ఉత్పత్తి వ్యవస్థల్లో పెట్టుబడులు పెట్టడం అత్యంత అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలు ఆధునిక యంత్రాల ఏర్పాటు, తయారీ వ్యవస్థల ఆధునికీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా కొత్త సాంకేతికతలు తయారీ వ్యవస్థలో భాగమవుతాయని, దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు నాణ్యత కూడా మెరుగుపడుతుందని చెప్పారు. తద్వారా రక్షణ రంగ తయారీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా, ఆధునికంగా మారుతుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి వాటిని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మార్గదర్శకత్వంలో 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనలో అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలతో భారత్ అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రముఖ రక్షణ ఎగుమతిదారుగా ఎదుగుతోందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్' నవభారత్ సాంకేతిక నైపుణ్యానికి, సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచిందని ఫడ్నవీస్ పేర్కొన్నారు. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తోందని అన్నారు. రక్షణ రంగ స్వయం సమృద్ధి లక్ష్య సాధనలో నాగ్‌పూర్ ప్రాంతం కీలక పాత్ర పోషించనుందని, కొత్త ఎక్స్‌ట్రూషన్ ప్రెస్ అందుకు దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ ఉత్పత్తి శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ గరిమా భగత్, వైఐఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) విజయ్‌కుమార్ అయ్యర్, రక్షణ శాఖ అధికారులు, సాయుధ దళాల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు పాల్గొన్నారు.

# రాహుల్ పుట్టిన రోజున రైతు డిక్లరేషన్ బొందపెట్టిన రేవంత్ సర్కార్: హరీశ్ రావు



సిద్దిపేట : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకు? అని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని రేవంత్ రెడ్డి మంత్రి వర్గాన్ని ఆయన అభివర్ణించారు. మీది విశ్వాసఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని రేవంత్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు.

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో ఘనవిజయం సాధించి, కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని మణికొండ (మల్కం చెరువు సమీపంలో) నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది.**




హైదరాబాద్ : జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు.

**గ్రేటర్ ఎన్నికలే తొలి లక్ష్యం!**

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణ వ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఓ సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**సంస్థాగత నిర్మాణం - చేరికలపై ఫోకస్**

హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.

# సంపాదకీయం

## ఆర్థిక వివేకం లేని అధికార లాలస

ఇప్పటికి కనీసం ఒక ఏడాది కాలంగా భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఆరోగ్యకరంగా లేదు. రూపాయి విలువ బాగా పడిపోయింది, దేశం నుంచి పెట్టుబడి తరలిపోతోంది. దేశీయ ప్రైవేట్ మదుపులు వెనుకబడ్డాయి. వినియోగ డిమాండ్ తగ్గిపోయింది. వస్తూత్పత్తి రంగం స్తబ్ధమయింది. సంపన్నులు, అంతగా సంపన్నులు కాని వారి మధ్య ఆర్థిక వ్యత్యాసాలు వేగంగా పెరుగుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా అగ్రగామి ఐటీ కంపెనీల షేర్ల విలువలు పడిపోతున్నాయి. ఈ బహువిధ సమస్యలన్నిటినీ మార్కెట్ మూడ్ ప్రతిబింబిస్తోంది. ప్రధాన సూచీలు అన్నీ రెండు సంవత్సరాల క్రితం ఎక్కడ ఉన్నాయో ఇప్పుడూ అక్కడే ఉన్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను అంగీకరించి వాటిని అధిగమించేందుకు అవసరమైన సంస్కరణలకు సత్వరమే శ్రీకారం చుట్టాలని మోదీ ప్రభుత్వానికి పలువురు ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. జాతీయ దినపత్రికలలో ఈ విషయమై వారు వ్యాసాలు రాస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభమైన తరువాత ఆ వ్యాసాలు దాదాపు ప్రతి రోజూ ప్రచురితమవుతున్నాయి. గ్యాస్, ఎరువులు, ఇతర సరుకుల మార్కెట్లపై యుద్ధం ప్రతికూల ప్రభావం చూపుతోంది. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపించే నిధులు తగ్గిపోయాయి. తత్ఫలితంగా మన విదేశీ మారకద్రవ్య నిల్వలు మరింతగా తగ్గిపోయాయి.

కస్టమ్స్ అధికారులు, పన్ను వసూళ్ల యంత్రాంగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించేలా చేయడంతో సహా పలు సంస్కరణ చర్యలను ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఆరోగ్య భద్రత, విద్యపై మరింత ఎక్కువగా ఖర్చు చేయాలని, శ్రమ సాంద్ర వస్తూత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాలని, మదుపుదారులకు సమానావకాశాలు సృష్టించాలని, తమకు ప్రీతిపాత్రులైన పెట్టుబడిదారులు మాత్రమే అత్యధిక ప్రాజెక్టులను స్వాయత్తం చేసుకోకుండా నిరోధించాలని, ఎరువుల, విద్యుత్ సబ్సిడీలను తగ్గించాలని, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై వివక్షకు స్వస్తి చెప్పాలని, ఆర్థిక వ్యవహారాల సంబంధిత మంత్రిత్వ శాఖలలో అత్యున్నత బాధ్యతల్లో ఉండి తమ విధ్యుక్త ధర్మాలను సమర్థంగా నిర్వహించని రాజకీయవేత్తలు, అధికారుల స్థానంలో బాగా సమర్థులైన, దీక్షాదక్షతలు ఉన్న వారిని నియమించాలని కూడా ఆర్థికవేత్తలు స్పష్టంగా సూచిస్తున్నారు. మన ప్రముఖ ఆర్థికవేత్తల సిఫారసులు కుల మతాలు, జెండర్, ప్రాంతాలు, రాజకీయ విశ్వాసాలకు అతీతంగా సమస్త భారతీయులకు సంక్షేమం, ఆర్థిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నాయనడంలో సందేహం లేదు. వారి సూచనలకు అదనంగా నేనూ నా సొంత సూచన ఒకటి చేయదలిచాను: ఎల్లెడలా వాయు, నీటి కాలుష్యాన్ని పెంపొందిస్తూ నేల సారాన్ని క్షీణింపజేస్తున్న, అడవులను నిర్మూలిస్తున్న పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫారసులను అంగీకరించి, వాటి అమలుకు పటిష్ఠ చర్యలు చేపడుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యతిరిక్తంగా ఉంటుందని ఈ కాలమిస్టు విశ్వసిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వంలో అతి ముఖ్యులైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రేరేపిస్తున్న ఉద్దేశాలు, సంకల్పాలు ఏమిటో నిశితంగా పరిశీలిస్తే ఆ సమాధానం సరైనదని స్పష్టమవుతుంది. నా అవగాహన ప్రకారం, ప్రధానమంత్రిని మూడు ఆకాంక్షలు ప్రభావితం చేస్తున్నాయి. మొదటిది.. సాధ్యమైనంత వరకు పదవిలో కొనసాగడం. మోదీ ఇప్పటికే 75 సంవత్సరాలు పైబడిన వయసులో ఉన్నారు. అంత వయసు ఉన్న నాయకులను పార్టీ 'మార్గదర్శక్ మండల్'కు పంపాలని ఆయనే స్వయంగా సిఫారసు చేశారు. వయసు పెరుగుతున్నా అధికారం నుంచి వైదొలిగేందుకు మోదీ సిద్ధంగా లేరు. సార్వత్రిక ఎన్నికలలో వరుసగా నాలుగో పర్యాయం కూడా విజయం సాధించాలనే పట్టుదల మోదీలో ప్రగాఢంగా ఉన్నది. తాను బహిరంగంగా విమర్శిస్తూ, రహస్యంగా అసూయపడుతున్న జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించడమే మోదీ అభిమతం. తన వ్యక్తి పూజను మరింతగా ప్రోత్సహించడం మోదీ రెండో ఆకాంక్ష. ప్రభుత్వ ధనాన్ని భారీ మొత్తంలో ఇందుకు వెచ్చిస్తున్నారు. పెట్రోల్ పంపులు, విమానాశ్రయాలు, రైళ్లు, రైల్వే స్టేషన్లు ఇంకా డజన్ల కొద్దీ వేర్వేరు ప్రదేశాలలో సర్వే సర్వత్రా మోదీ బొమ్మ కనిపిస్తూనే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రదేశాలన్నిటిలోనూ మోదీ మీకు దర్శనమిస్తూనే ఉంటారు. ప్రధానమంత్రి స్వాతిశయానికి అవధులు లేవు. సదా ప్రజల దృష్టిలో ఉండాలని, సకల జనుల చేత ఆరాధింపబడాలని ఆయన ప్రగాఢంగా కోరుకుంటారు. ఎలాగైనా సరే 'హిందూ రాష్ట్ర'ను సృష్టించడం ఆయన మూడో ఆకాంక్ష. పన్నెండేళ్ల క్రితం 2014లో 'సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్'కు కృషి చేస్తానని ప్రధానమంత్రి వాగ్దానం చేశారు. అయితే ఇచ్చినంత వేగంగానే ఆయన ఆ వాగ్దానాన్ని విడిచిపెట్టారు. ఇప్పుడు ఆయన తనను తాను హిందువుల నాయకుడుగా మాత్రమే నివేదించుకుంటున్నారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో ఆయన పూజలు, సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణ అమృతోత్సవాలు మొదలైనవి అందుకు ఉదాహరణలు. నరేంద్ర మోదీ మూడు ఆశయాలలో అమిత్ షా రెండిటిని పూర్తిగా పంచుకుంటున్నారు: తనకు మరింతగా రాజకీయ అధికారం, హిందూ మెజారిటేరియనిజంను ప్రోత్సహించడం. ఎన్నికల కార్యకలాపాలలో ఆయన అంతకంతకూ ఎక్కువ సమయాన్ని గడపడం, ప్రభుత్వ వ్యవహారాలపై పెరుగుతున్న ఆయన ప్రభావం ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి: అమిత్ షా ఇంకెంత మాత్రం తననుతాను మోదీ విధేయ అనుయాయిగా కాకుండా మోదీకి అనివార్య రాజకీయ వారసుడుగా భావించుకుంటున్నారు. మోదీ వలే అమిత్ షా కూడా హిందూ రాష్ట్రను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన ఆశిస్తున్న హిందూ రాజ్యంలో ఇతర మతాల వారు... ముఖ్యంగా ముస్లింలు ద్వితీయశ్రేణి పౌరులుగా మాత్రమే ఉంటారు. హిందూ రాష్ట్ర స్వప్న సాకారానికి అమిత్ షా తన బాస్‌కంటే ఎక్కువగా కృషి చేస్తున్నారు. ముస్లింలను నిందించడం ఆయనకొక నిత్య వ్యాపకం. తమ రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకుని, విస్తరింపజేసుకోవడమే మోదీ, షాల పరమ ధ్యేయం. ఈ లక్ష్యం పైనే వారు తమ మనసును కేంద్రీకరించారు. పరస్పర సంబంధమున్న నాలుగు పరస్పర రీతుల్లో వారు ఆ లక్ష్యసాధనలో సఫలమయ్యారు. మొదటిది.. సంఘటిత హిందూ ఓటు బ్యాంకు నిర్మాణం. ముస్లిం మైనారిటీలు తమపై పెత్తనం చేసే రోజులు వస్తాయనే భయభ్రాంతులను హిందువులలో సృష్టిస్తున్నారు. తద్వారా వారిలో 60శాతం మంది బీజేపీకి ఓటు వేస్తే ఆ పార్టీ ఓట్ల వాటా ఇంచుమించు 45శాతంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఈ ఓటు బ్యాంకు సరిపోతుంది. రెండోది.. మహిళలు, రైతులు మొదలైన సామాజిక వర్గాలకు క్రమబద్ధంగా నగదు చెల్లింపులు చేయడం. ఈ చెల్లింపుల సొమ్ము స్వల్పమే అయినా ప్రభుత్వం తమకు ఏదో ఒకటి చేస్తుంది కదా అనే సంతృప్తి ఓటర్లలో కలుగుతుంది. మూడోది.. ప్రభుత్వ సంస్థలపై పూర్తి నియంత్రణ సాధించి తమ రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఉపయోగించడం. ఇప్పటికే ఎన్నికల సంఘం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ విధంగా దుర్వినియోగమవుతున్నాయి. నాల్గవది.. ఎంపిక చేసుకున్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడం. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టులు పొందిన ఆ కుబేరులు బీజేపీకి ఆర్థిక వనరులు సమకూర్చుతారు. జూన్ 2013లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోను, 14 రాష్ట్రాల లోను అధికారంలో ఉన్నది. అప్పట్లో బీజేపీ కేవలం నాలుగు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్నది. 2014 నుంచి మూడు సార్వత్రిక ఎన్నికలను వరుసగా గెలిచిన బీజేపీ ఇప్పుడు 22 రాష్ట్రాలలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ కేవలం ఐదు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్నది.

## జూన్ 20, 21న పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పర్యటన

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూన్ 20, 21 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైల్వేలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్యపాలన, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి దేశానికి అంకితం చేయనున్నారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

జూన్ 20న హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించే పశ్చిమ బెంగాల్ దినోత్సవ కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.దేశవ్యాప్తంగా రైతులకు ఊరటనిచ్చే విధంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) 23వ విడత నిధులను విడుదల చేయనున్నారు. రూ.18,880 కోట్లకు పైగా మొత్తాన్ని 9.44 కోట్ల మందికి పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. పశ్చిమ బెంగాల్‌లోనే 45 లక్షల మందికి పైగా రైతులు ఈ విడత ద్వారా లబ్ధి పొందనున్నారు.అలాగే 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన', 'అగ్రిస్టాక్', 'ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్', 'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన' వంటి కీలక వ్యవసాయ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. రైతుల ఆదాయ పెంపు, పంటల భద్రత, డిజిటల్ వ్యవసాయ సేవల విస్తరణ, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహం ఈ పథకాల ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.మత్స్యపాలన రంగంలో ఫ్రేజర్‌గంజ్‌లో ఆధునికీకరించిన ఫిషింగ్ హార్బర్, బీర్‌భూమ్‌లో ఆధునిక చేపల మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. నాదియా జిల్లాలో పశుసంవర్ధక రంగానికి ఉపయోగపడే ప్రాంతీయ వీర్య ఉత్పాదన కేంద్రం, వీర్య బ్యాంకును కూడా ప్రజలకు అంకితం చేయనున్నారు.రైల్వే రంగంలో సుమారు రూ.590 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. సంక్‌రాయిల్-సంత్రాగాఛీ లింక్ లైన్‌ను దేశానికి అంకితం చేయడంతో పాటు హౌరాలో 300 పడకల డివిజనల్ రైల్వే ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. గ్రామీణ అనుసంధానాన్ని బలోపేతం చేసే 49 రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించనున్నారు.జూన్ 21న కోల్‌కతాలో జరిగే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని పాల్గొని యోగా అభ్యాసకులతో కలిసి కామన్ యోగా ప్రోటోకాల్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవం ఇతివృత్తం "ఆరోగ్యకర వృద్ధాప్యానికి యోగాభ్యాసం"లిగా నిర్ణయించారు. అదే రోజు కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన భారత నౌకాదళ నౌకలు ఐఎన్ఎస్ దునాగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రేలను దేశానికి అంకితం చేయనున్నారు. భారతీయ పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్మితమైన ఈ నౌకలు దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనున్నాయి.

ప్రధాని పర్యటన సందర్భంగా ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, రక్షణ రంగ బలోపేతానికి దోహదం చేయనున్నాయి.

## రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం



సమయం ప్రతినిధి : రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చుట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ మేరకురూ.36.65 కోట్లతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మినీ స్టేడియంల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం శంకుస్థాపన చేశారు.రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలలో బాల బాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను సీఎం ప్రారంభించారు.

**శంకుస్థాపనల వివరాలు:**

రూ.10 కోట్లతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం.

రూ.10 కోట్లతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డా.,బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునీకరణ

రూ.4 కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం

రూ.4 కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్ట్స్ నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.

రూ.3.50 కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం

రూ.2.65 కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం

రూ.2.50 కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్ ట కబడ్డీ కోర్ట్స్ నిర్మాణం.

**ప్రారంభోత్సవాలు:**

రూ.5.70 కోట్లతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఖీ×ఖీూ-ూ×ఖీఖీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం

రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఖీ×ఖీూ-ూ×ఖీఖీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం

రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం

రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం

రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం

రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం

రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం

రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం

## రాచకొండ వెంకమ్మ మృతికి గౌడ సంఘం సంతాపం



సమయం, నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని నోముల గ్రామానికి చెందిన రాచకొండ వెంకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో గౌడ సంఘం నోముల అధ్యక్షులు గుండ గోని జంగయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కొప్పు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రాసకొండ హుస్సేన్, అధ్యక్షుడు బాధిని యాదయ్య గౌడ్, సభ్యులు రాచకొండ ముత్యాలు, ఎరుకలి రాజు, దిండుగాళ్ల సైదులు, బాదిని రాము, ఎరుకలి అంజయ్య, ఎరుకలి పెద్ద రంగయ్య, ఎరుకలి యాదగిరి, భూపతి శ్రీను, ఎరుకలి చిన్న రంగయ్య, ఎరుకలి సాయిలు, ఎరుకలి సత్తయ్య, దిండుగాల రాజు, భూపతి యాదయ్య, ఎరుకలి పెద్ద సత్తయ్య, దిండుగాల మల్లయ్య, భూపతి నాగేంద్రబాబు, రాచకొండ సతీష్, రాచకొండ జానయ్య, రాచకొండ సైదులు, రాచకొండ నగేష్, రాచకొండ అంజయ్య, మృతురాలి కుమారులు రాచకొండ వెంకన్న, రాచకొండ నరసింహ, రాచకొండ యాదయ్య ఉన్నారు.

## ఏపీ కి వచ్చిన ఘరానా దొంగలు.... పోలీసులు అప్రమత్తం

సమయం ప్రతినిధి : మధ్యప్రదేశ్కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా కదలికలపై ప్రకాశం, ఏలూరు జిల్లాల పోలీసులు అప్రమత్తమయ్యారు. ధార్ జిల్లాకు చెందిన నిందితుల ముఠా రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పలు ప్రాంతాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. చీరాలలో గతంలో చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ముఠాలతో ఈ గ్యాంగ్కు సంబంధాలు ఉండొచ్చన్న అనుమానంతో స్థానిక నేరస్థుల కదలికలపైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ చీరాల టూ టౌన్ సీఐ శశికుమార్ అనుమానితుల ఫొటోలతో పోస్టర్లను విడుదల చేశారు. పోస్టర్లలో ఉన్న వ్యక్తులు చోరీలు, దోపిడీ కేసుల్లో నిందితులని, వారి ఆచూకీ తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పర్చూరులోనూ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పర్చూరు ఎస్ఐ పులి గోపి మాట్లాడుతూ, ధార్ గ్యాంగ్ కదలికలపై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత కొనసాగుతోందని తెలిపారు. ఏలూరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో ముగ్గురు అనుమానితుల కదలికలు సీసీ కెమెరాల్లో నమోదైనట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతో ఈ ముఠా కదలికలను గుర్తించి నేరాలను అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు

## అనంతకు భారీగా పరిశ్రమలు

అనంతపురం : ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులపై ఫోకస్ పెట్టింది. అది కూడా ఒక్క జిల్లాకు పరిమితం కాకుండా.. జిల్లాల వారీగా ఓ ప్లాన్ ప్రకారం పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పరిశ్రమలు క్యూ కట్టాయి. పుట్టపర్తి, హిందూపురంతో పాటుగా అనంతపురం ప్రాంతాలకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని ఏపీకి కంపెనీలు ఎందుకు వస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీపంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. గతేడాది బెంగళూరులో ఉన్న ఐటీ కంపెనీ సీఈవో కష్టాలు చెప్పుకుంటూ ట్వీట్ చేశారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి.. ఏపీకి రమ్మని ఆహ్వానించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ అనంతపురాన్ని కొత్త ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా పేర్కొన్నారు. ఏరోస్పేస్, ఇతర పరిశ్రమలకు ఏపీలో 8వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ ఆహ్వానం పలికారు. లోకేష్ ఇచ్చిన పిలుపు కూడా పరిశ్రమల రాకకు ఓ కారణంగా చెప్పొచ్చు.ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు.. సోలార్, డ్రోన్ పరిశ్రమలు రాగా.. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి మరింత బూస్టప్ ఇచ్చింది.

# మహబూబ్‌నగర్‌లో పీఐబీ 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్





**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం**
**కృత్రిమ మేధ యుగంలో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి: డీపీఆర్‌వో పి. శ్రీనివాస్**

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** "12 ఏళ్ల విశ్వాసం, వికాసం, ప్రజా సంక్షేమం" అంశంపై పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్‌లో 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా సంబంధాల అధికారి పి. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కృత్రిమ మేధ, డిజిటల్ సమాచార యుగంలో వార్తలను ప్రచురించే ముందు వాస్తవ నిర్ధారణ చేసుకోవడం అత్యంత అవసరమని సూచించారు. నైతిక విలువలతో కూడిన బాధ్యతాయుతమైన పాత్రికేయం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పీఐబీ మీడియా, కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రముఖ పాత్రికేయుడు ముద్దం నరసింహస్వామి గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఫ్యాక్ట్ చెక్ శిక్షకురాలు బీఎన్ సత్యప్రియ డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, వాస్తవ నిర్ధారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. సుమారు 140 మంది జర్నలిస్టులు పాల్గొన్న ఈ వర్క్‌షాప్‌లో జర్నలిజం, డిజిటల్ మీడియా, సమాచార ప్రసారం, వాస్తవ నిర్ధారణ వంటి అంశాలపై నిపుణులు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులను డీపీఆర్‌వో పి. శ్రీనివాస్ అభినందించారు.

# బీఆర్ఎస్ అప్ డేటెడ్...

హైదరాబాద్ : బీఆర్ఎస్ కోసం ఎన్నికల వ్యూహకర్తని నియమించుకోవాలన్న ప్రతిపాదన వచ్చిందా? ఆ విషయమై పార్టీలో గట్టి చర్చే జరిగిందా? సీనియర్ లీడర్స్ ఎలాంటి ప్రతిపాదన చేశారు? అందుకు కేసీఆర్ ఏమన్నారు? అందుసు సంబంధించి గులాబీ దళంలో జరుగుతున్న డిస్కషన్స్ ఏంటి? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్ళ సమయం ఉంది. ప్రతిపక్ష పార్టీలు ఇప్పట్నుంచే ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఎలక్షన్ ప్లానింగ్ మొదలు పెట్టేశాయి. ఈ సందర్భంగానే ఎన్నికల వ్యూహకర్తల ప్రస్తావన ఆసక్తికరంగా మారింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో ఈ విషయమై హాట్ హాట్ చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని పట్టు మీదున్న గులాబీ పార్టీ అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ట్రెండ్‌కు తగ్గట్టు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఒక కీలకమైన వ్యూహకర్తను నియమించుకోవడానికి ప్లాన్ చేశారట సీనియర్స్, ముఖ్య నాయకులు అంతా కలిసి. ముందు వాళ్ళలో వాళ్లు మాట్లాడుకుని ఒక అవగాహనకు వచ్చి.. ఫైనల్‌గా ఇదే విషయాన్ని అధినేత కేసిఆర్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్టు తెలుస్తోంది. వాళ్ళు మనకు మించిన వ్యూహకర్తలా అని అన్నట్టు చెప్పుకుంటున్నారు. పార్టీ నేతల ప్రతిపాదనను కేసీఆర్ తిరస్కరించడానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నట్టు చెబుతున్నారు పార్టీ నేతలు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు పోరాటం చేయడం, ఆ తర్వాత పదేళ్లు అధికారంలో ఉండటంతో పాటు టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లోకి కూడా వెళ్ళేలా ప్లాన్ చేశారు కేసీఆర్. వివిధ రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడంతోపాటు కేంద్రంలో అధికారం దిశగా పావులు కదిపారాయన. అంత కీలకమైన అలాంటి సమయంలోనే ఎలాంటి వ్యూహకర్తని పెట్టుకోలేదు, ఇప్పుడు మనం వ్యూహకర్తని అంటూ నియమించుకుంటే ఇక ఏదీ మన చేతిలో ఉండదు, పార్టీ మొత్తం వాళ్ళు చెప్పినట్టే నడవాల్సి ఉంటుంది. పార్టీ చేసే కార్యక్రమాలు, పోరాటాల దగ్గర నుంచి ఎన్నికల ముందు సర్వేలు చేసి టికెట్లు ఇచ్చే వరకు ఏదీ మన చేతిలో ఉండదు. పూర్తి బాధ్యతలు స్ట్రాటజిస్ట్‌కు అప్పచెబితేనే వాళ్లు ఆ పని చేస్తారు. అలా ఏదీ మన చేతిలో లేనప్పుడు వాళ్లతో మనకు అవసరం లేదని అన్నట్టు తెలుస్తోంది. ఒక్కరితో మొదలైన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసే వరకు పోరాడడం, పదేళ్ల పాటు అధికారంలో ఉండే విధంగా వ్యూహాలు రూపొందించిన తాను కొత్తగా ఎవరో మరో వ్యక్తి వచ్చి చెబితే కార్యక్రమాలు చేయాలా అంటూకేసీఆర్ సున్నితంగా తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇక అధికారంలోకి రావడానికి రెండో అంశాన్ని కూడా కేసీఆర్ నేతలకు వివరించినట్టు తెలుస్తోంది. ఇప్పుడు పవర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని,ఆ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, తాము అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను గుర్తు చేయడంలాంటి వాటితోనే తేలిగ్గా గెలుస్తామని చెప్పినట్టు తెలిసింది. అయితే గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే? ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కొన్ని రోజులపాటు సేవలు అందించారు. అప్పుడు పీకే చెప్పిన కార్యక్రమాలు నచ్చకపోవడంతో కేసీఆర్ ఆయన్ని దూరం పెట్టేశారట. అయితే అది బీఆర్ఎస్ అధికారంలో స్వింగ్ లో ఉన్న టైం అని, కానీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కోవాలంటే వ్యూహకర్త అవసరం అన్న వాదనని సీనియర్ నేతలు కొందరు సమర్థిస్తున్నారట. మరికొంతమంది మాత్రం కేసీఆర్ లాంటి రాజకీయ ఉద్దండుడు గులాబీ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నప్పుడు మరొకరితో పనేముందని క్లారిటీగా చెబుతున్నారట. మొత్తం మీద ఎన్నికల వ్యూహకర్త విషయమై గులాబీ దళంలో గట్టి చర్చే జరుగుతోంది.

## విజయ్‌తో ఎండీఎంకే

చెన్నై : తమిళనాడులో మళ్లీ కొత్త పొత్తు తెరపైకి రానుందా? డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇదే విషయం హాట్ టాపిక్ గా మారింది. ఎందుకంటే ఎండీఎంకే అధినేత వైకో, సీఎం విజయ్ తో భేటీ అయ్యారు. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. దీంతో పొత్తు వుంటుందా? అన్న అంశం తెరపైకి వచ్చింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది.

## కాపు నేతల్లో కాక...

రాజమండ్రి : రాజకీయాల్లో కొంతమంది పనితీరుతో రాణిస్తారు. మరికొందరు సెంటిమెంట్ రాజకీయాలు నడిపి రాణిస్తారు. రెండో కోణంలో రాణించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి పై ఉన్న ప్రజాభిమానాన్ని తాను పొందగలిగారు. తండ్రి మాదిరిగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసు గెలవాలని చూసారు. కానీ ప్రజలు మాత్రం జగన్మోహన్ రెడ్డిలో రాజశేఖర్ రెడ్డిని చూసుకోలేదు. మహానేత కుమారుడిగా ఒక్కసారి మాత్రమే ఛాన్స్ ఇచ్చారు. రెండోసారి మాత్రం చాన్స్ ఇవ్వలేదు. అయితే రాజశేఖర్ రెడ్డి చేయలేనంతగా.. కులాలను, వర్గాలను విడదీసి వారి అభిమానాన్ని పొందాలనుకున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఒక్కసారి మాత్రమే అందులో కూడా సక్సెస్ అయ్యారు. రెండోసారి విఫలమయ్యారు.ఏపీలో ఎవరు అధికారంలోకి రావాలన్నా ప్రధాన సామాజిక వర్గంగా ఉన్న కాపులు మద్దతు ఉండాల్సిందే. అయితే ఆ కాపులను 2019 ఎన్నికల్లో టర్న్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు జగన్మోహన్ రెడ్డి. కాపు రిజర్వేషన్ ఉద్యమం ద్వారా భారీగా లబ్ధి పొందారు. ఇప్పుడు కూడా అటువంటి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి కాపులే కారణమని జగన్మోహన్ రెడ్డి గుర్తించారు. అందుకే వారిలో చీలిక తేవాలని చూస్తున్నారు. కాపుల వేళ్ళతో కాపులను పొడిచే సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. కాపు ఓటు బ్యాంకును చీల్చడమే కూటమిని దెబ్బతీసే ఏకైక మార్గం అని బలంగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కాపులు ఆదరించని వైసీపీ కాపు నేతలు చాలామంది ఉన్నారు. వారిని ముందు పెట్టి ఇప్పుడు రాజకీయ క్రీడ మొదలుపెట్టారు.ఒక అంబటి రాంబాబు, పేర్ని నాని, తోట త్రిమూర్తులు, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు, బొత్స సత్యనారాయణ.. ఇలాంటి వైసీపీ కాపు నేతలను ముందు పెట్టి కాపుల విషయంలో బలమైన ప్రచారానికి జగన్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. పవన్ కళ్యాణ్ రూపంలో కూటమిలో డిప్యూటీ సీఎం పదవి ఉన్న కాపులకు ఎటువంటి ప్రయోజనం లేదని ప్రచారం మొదలుపెట్టారు. కాపు సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని కోణంలో వ్యతిరేకతను నూరి పోయాలని చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ పై కాపు యువతలో, ఓటర్లలో అసంతృప్తిని పెంచగలిగితే.. ఆ ఓట్లు ఆటోమేటిక్గా తమ వైపు టర్న్ అవుతాయన్నది జగన్ ఆలోచన.అయితే జగన్మోహన్ రెడ్డి కాపు సామాజిక వర్గ ఆలోచనను తక్కువగా అంచనా వేస్తున్నారన్న విశ్లేషణ ఉంది. ఎందుకంటే 2014 నుంచి 2019 మధ్య కాపుల విషయంలో జగన్ అనుసరించిన వైఖరి తెలియంది కాదు. ముఖ్యంగా చంద్రబాబు సర్కార్ ఇచ్చిన ప్రయోజనాలను సైతం రద్దుచేసి కాపులను ఒక ఓటు అస్త్రంగా మార్చుకున్న వైనాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకున్నారు.

## ప్రమాదకరంగా క్యాట్ ఫిష్

మహబూబ్ నగర్ : ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే క్యాట్‌ఫిష్ పెంపకంపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ వనపర్తి జిల్లాలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా అక్రమ చెరువులు వెలిసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వీటికి కుళ్లిన చికెన్ వేస్టేజీని ఆహారంగా వేస్తుండటంతో చుట్టుపక్కల పొలాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. తక్కువ ఖర్చుతో కోట్లు సంపాదించవచ్చుననే ఆశతో ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడ చేపలను పెంచి విజయవాడ, వైజాగ్, బెంగళూరులకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాట్‌ఫిష్ (ఆఫ్రికన్ మాగుర్) పెంపకంపై దేశవ్యాప్తంగా కఠినమైన నిషేధం విధించాయి. అయితే.. చట్టాల పట్ల ఏమాత్రం భయం లేకుండా, అధికారుల కళ్లు గప్పి వనపర్తి జిల్లాలో క్యాట్ ఫిష్ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని.. కేవలం ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా క్యాట్‌ఫిష్ పెంపకం చెరువులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ రకమైన నిషేధిత చేపల చెరువులు జోరుగా సాగుతున్నాయి. గతంలో మత్స్యశాఖ అధికారులు నామమాత్రంగా కొన్ని చెరువులను ధ్వంసం చేసి చేతులు దులుపుకోవడంతో నిర్వాహకులు మళ్లీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు.వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు మున్సిపాలిటీల పరిధిలోని చికెన్ సెంటర్ల నుంచి సేకరించే వ్యర్థాలను ఈ క్యాట్‌ఫిష్‌లకు ప్రధాన ఆహారంగా వాడుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచే ప్రతిరోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు, ఆ చెత్తను మున్సిపల్ యార్డులకు తరలించకుండా ఈ అక్రమ పెంపకందారులకు అమ్మేస్తున్నారు. సాధారణ దాణా కంటే ఈ కుళ్లిన మాంసాన్ని తినడం వల్ల క్యాట్‌ఫిష్‌లు చాలా తక్కువ కాలంలోనే ఊహించని విధంగా బరువు పెరుగుతాయి. ఇతర రకాల చేపలేవీ ఈ మాంస వ్యర్థాలను ముట్టవు. అయితే.. టన్నుల కొద్దీ చికెన్ వ్యర్థాలను చెరువుల వద్ద కుప్పలుగా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాలు నరకప్రాయంగా మారుతున్నాయి. తీవ్రమైన దుర్వాసనతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నామని, పంట పొలాల్లో పనులు చేసుకోలేకపోతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అక్రమ దందాను నడిపిస్తోంది పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు బడా ఆక్వా వ్యాపారులని సమాచారం. వనపర్తిలోనే పదుల సంఖ్యలో చెరువులను లీజుకు తీసుకుని స్థానిక యంత్రాంగాన్ని మేనేజ్ చేస్తూ వీరు కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. సాధారణ చేపలు మార్కెట్లో కిలో రూ. 150 వరకు పలుకుతుండగా.. ఈ క్యాట్‌ఫిష్‌లను హోల్‌సేల్‌గానే కిలో రూ. 100 పైచిలుకు ధరకు అమ్ముతున్నారు. ఇక్కడ పెంచిన చేపలను విజయవాడ, విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలతో పాటు బెంగళూరు మహానగరానికి భారీ కంటైనర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. క్యాట్‌ఫిష్‌లను తినడం వల్ల మానవులలో క్యాన్సర్, కాలేయ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి టాస్క్‌ఫోర్స్ రంగాన్ని రంగంలోకి దింపి ఈ చెరువులను శాశ్వతంగా మూసివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా.. లక్ష్యాల వైపు యువత అడుగులు వేయాలి

**వెన్నచేడ్ పీఎం శ్రీ పాఠశాలలో 'నిషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమం**

**సమయం ప్రతినిధి, వెన్నచేడ్:** మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును చీకటిలోకి నెడుతుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నిషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా శుక్రవారం వెన్నచేడ్ గ్రామంలోని పీఎం శ్రీ పాఠశాలలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని అన్నారు. యువత దేశానికి ఆస్తి అని, మంచి అలవాట్లు, క్రమశిక్షణ, విద్యతోనే విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే మంచి విలువలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ఆదర్శ పౌరులుగా ఎదగవచ్చని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ మల్లమ్మ, అలివేలు, సఖి కౌన్సిలర్ సిరిన్, పోలీసు శాఖ ఏఎస్ఐ, గ్రామ కార్యదర్శి చెన్నకేశవులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదక ద్రవ్యాల విక్రయాల గురించి సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం



"డ్రగ్స్‌కు నో చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి" అంటూ ప్రతిజ్ఞ చేసి, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని సంకల్పించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం డ్రగ్స్ వ్యతిరేక సందేశాలతో మార్మోగగా, కార్యక్రమం విద్యార్థుల్లో విశేష చైతన్యం నింపింది. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. "నిషా ముక్త్ భారత్ – మనందరి బాధ్యత.. డ్రగ్స్ రహిత సమాజమే అభివృద్ధికి పునాది" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

## వైసీపీ ట్రాప్‌లో చింతమనేని

ఏలూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులను రెచ్చగొట్టి మాట్లాడించడం ఒక అలవాటైన విద్య. ఒక విషయాన్ని వివాదాస్పదం చేయడం కూడా ఆ పార్టీకి తెలిసినంతగా మరో పార్టీకి తెలియదు. ఇప్పుడు దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విషయంలో అలానే చేసింది ఆ పార్టీ. ఆయనను రెచ్చగొట్టి.. రహదారిపైకి వచ్చేలా చేసి.. దానిపై వ్యతిరేక ప్రచారం చేయించి.. రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. అందులో కొంత వరకు సక్సెస్ అయ్యింది కూడా. చింతమనేని ప్రభాకర్ కు వ్యతిరేకంగా లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు తో వైసిపి ఆడిన హైడ్రామా.. నిజంగా పక్కా పొలిటికల్ స్క్రీన్ తో చేసినదే. ప్రెస్మీట్లో లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు చింతమనేని ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులకు విమర్శలు చేశారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ.. చింతమనేని లో ఉన్న ఆగ్రహాన్ని బయటకు తీసేలా చేసి రెచ్చగొట్టారు. అనుకున్నది సాధించగలిగారు.దెందులూరు లో గెలిచారు చింతమనేని ప్రభాకర్ రావు వైసీపీ నేత కొఠారు అబ్బయ్య చౌదరిపై. సహజంగానే మాస్ ఇమేజ్ ఉంది చింతమనేని ప్రభాకర్ కు. దానిని దెబ్బతీసేందుకు టిడిపి ముసుగు వేసుకొని ఉన్న లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావును ఆశ్రయించారు. చింతమనేని ప్రభాకర్ ను ఆయనతో తిట్టించారు. చింతమనేని అనుచరులపై లేనిపోని ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా చింతమనేని కుటుంబ సభ్యులు, కుమార్తెలపై కూడా పరోక్ష వ్యాఖ్యలు చేసి ప్రభాకర్ లో ఉన్న ఆగ్రహాన్ని తట్టి లేపారు. ఈ మొత్తం ఒక పొలిటికల్ అజెండాగా సాగించారు అబ్బయ్య చౌదరి. లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు అబ్బయ్య చౌదరితో కలిపి చేసిన రాజకీయాన్ని టిడిపి హై కమాండ్ సైతం గుర్తించింది. అందుకే ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది.మొన్నటి ఎన్నికల్లో దెందులూరు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు చింతమనేని ప్రభాకర్. ఓడిపోయిన అబ్బయ్య చౌదరి ఎలాగైనా నియోజకవర్గంలో నిలదొక్కుకోవాలని చూశారు. కూటమి ప్రభుత్వంతో పాటు చింతమనేని డిఫెన్స్ లో పడేయాలని ఒక లోతైన వ్యూహాన్ని రచించారు. చింతమనేని దెబ్బ కొట్టేందుకు ఆయనకు అత్యంత ఆప్తుడిగా ఉంటూ? లోగుట్లు తెలుసుకున్న ఈడుపుగంటి శ్రీనివాసరావు వాటిని అస్త్రంగా మలుచుకున్నారు. చింతమనేని ఆర్థిక మూలాలను, కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రెస్ మీట్ లు పెట్టడానికి వైసీపీ బ్యాక్ అండ్ సపోర్ట్ తీసుకున్నారు. అలా ఆడిన వ్యవహారంలో చింతమనేని చిక్కుకున్నారు. చింతమనేనిని మానసికంగా దెబ్బతీసేందుకు ఆయన కుటుంబ సభ్యులను సైతం వివాదాల్లోకి లాగారు.

## కడపలో కళకళలాడుతున్న స్టేడియం

కడప : కడప క్రికెట్ స్టేడియానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాత్రి సమయంలో తీసిన కడప స్టేడియం ఏరియల్ వ్యూ వీడియో కూడా ఆకట్టుకుంటోంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం దక్కడంతో.. కడప స్టేడియం గురించి అందరికీ తెలిసింది. ఇది దేశంలోనే అత్యంత అందమైన క్రికెట్ స్టేడియాల్లో ఒకటి అని చెబుతున్నారు. ఇంకా డెవలప్ చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షించడానికి వీలుగా స్టేడియం కెపాసిటీని పెంచితే.. ఇక్కడ టెస్టులు, వన్డేలు నిర్వహించొచ్చని సూచిస్తున్నారు.'ఎప్పుడు ఈ రూట్లోనే వెళుంటా.. కానీ ఈ స్టేడియం ఇంత బాగుంటుందని నాకు తెలీదు. ఏరియల్ వ్యూ చాలా బాగుంది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ స్టేడియం పక్కనే రైల్వే ట్రాక్ ఉంటుందని.. రైల్లో వెళ్తున్నప్పుడు ఈ ప్రదేశాన్ని చూడటం భలే ఉంటుందని మరో నెటిజన్ తన అనుభవాన్ని చెప్పుకొచ్చారు. అంతా బాగానే ఉంది కానీ.. వేసవిలో ఏపీలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో కడప ఒకటి. ఎండా కాలం ఇక్కడ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి, అదొక్కటే కొంచెం ఇబ్బంది అని ఓ నెటిజన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.క్రికెట్‌కు సంబంధించిన అప్డేట్స్‌ను ఎప్పటికప్పుడు ఎక్స్ ద్వారా అందించే జాన్స్ అనే వ్యక్తి ' ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేదిక – కడప' అనే క్యాప్షన్‌తో పోస్టు చేసిన ఫొటోకు కొద్ది గంటల్లోనే 10 వేలకుపైగా లైకులు వచ్చాయి.ఈ క్రికెట్ స్టేడియం కడప నగరానికి 10 కిలోమీటర్ల దూరంలోని పుట్లంపల్లె ఏరియాలో ఉంది.

# యువతకు ఆశాకిరణం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

( సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : భారతదేశ భవిష్యత్తుకు మార్గదర్శిగా, యువతకు ఆశాకిరణంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గారు నిలిచారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ నగరంలోని గడియారం చౌరస్తా వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించి 56 ఫీట్ల బర్త్ డే కేకు ను ఆయన అనాద విద్యార్థులతో కలిసి కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా అనాద విద్యార్థులకు కొత్త బట్టలను అందజేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత పన్నెండు సంవత్సరాలుగాదేశంలో కొనసాగుతున్న పాలనలో మధ్యతరగతి ప్రజల జీవితం కష్టాల్లోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని, నిరుద్యోగం పెరిగిందని, సామాన్య ప్రజలపై భారం ఎక్కువైందని పేర్కొన్నారు. విదేశీ అప్పులు పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి దిశానిర్దేశం చేసే నాయకుడిగా రాహుల్ గాంధీ ఎదిగారని వారు పేర్కొన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం రాజకీయాలు చేయాలని భావించే అరుదైన నాయకుడు ఆయన అని కొనియాడారు. రెండు సార్లు ప్రధానమంత్రి అయ్యే అవకాశాలు వచ్చినప్పటికీ, వారి వ్యక్తిగత ఆశయాల కంటే పార్టీ మరియు దేశ ప్రయోజనాలను ముందుకు ఉంచారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను అర్థం చేసుకునేందుకు ఆయన చేసిన పాదయాత్రలు, పోరాటాలు, ప్రజలతో కలిసిన విధానం ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేసిన నాయకుడు రాహుల్ గాంధీ నని అన్నారు. ఈరోజు యువతలో ఆయనపై విశ్వాసం పెరుగుతోందని, ఆయనను భవిష్యత్తులో ప్రధానమంత్రిగా చూడాలని కోట్లాదిమంది భారతీయులు ఆకాంక్షిస్తున్నారని స్పష్టం చేశారు. దేశానికి నూతన దిశను చూపగల నాయకత్వం రాహుల్ గాంధీ దేనని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామం నుంచి నగరం వరకు "గడప గడపకు కాంగ్రెస్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగించేందుకు, అలాగే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ మంది ఎంపీలను గెలిపించి, శ్రీ రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిగా చూడాలన్నది ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సంకల్పమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, వినోద్ కుమార్, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయకుమార్, ఉపాధ్యక్షులు వేముల కృష్ణయ్య, డిసిసి ప్రధాన కార్యదర్శి సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, సాయిబాబా, రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి సిజే బెనహర్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, యువ నాయకులు, నగర కార్పొరేటర్లు, మహిళా నాయకులు, గ్రామ అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత






(సమయం ప్రతినిధి మక్తల్) : మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం లోని 7 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో SIR (ఓటరు సవరణ ప్రక్రియ) పై అవగాహన శిక్షణా శిబిరం నిర్వహించారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు రాజేంద్ర ప్రసాద్‌లు BLA లకు ఓటరు సవరణ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు అందించే ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను అర్హులైన ప్రతి ఓటరుకు చేరేలా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ సవరణ ప్రక్రియలో నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ వ్యక్తి ఓటు హక్కును కాపాడేందుకు మనమందరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మక్తల్ లో 80 వేల ఓట్లను చో?రీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్ లో SIR పేరుతో లక్షలాది ఓట్లను తొలగించి టీఎంసీ ని అధికారంలోకి రానీయకుండా బిజెపి అడ్డుకున్నదని మంత్రి విమర్శించారు. మన రాష్ట్రంలో కూడా లక్షలాది ఓట్లను తొలగించడానికి బిజెపి కుట్రలు చేస్తోందని మంత్రి దుయ్యబట్టారు. తెలంగాణలో అలా జరగకుండా ఉండాలంటే మనందరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి అవి చేరాలని స్పష్టం చేశారు. ఓటరు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించకపోతే జూలై 30న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. తమ తమ గ్రామాల్లో ఓటరు జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించి నమోదు చేయించాలని బూత్ లెవల్ ఏజెంట్ల కు పిలుపునిచ్చారు. ఓటరు సవరణ ప్రక్రియ ఈనెల 25న ప్రారంభమై వచ్చేనెల 24 వరకు జరుగుతుందని తెలిపారు. తర్వాత వచ్చే నెల 31న ముసాయిదా ప్రచురణ జరుగుతుందన్నారు. ఓటరు సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే జులై 31 నుండి ఆగస్టు 30 వరకు స్వీకరిస్తారని అంతలోపే మన ఓటు హక్కును కాపాడుకోవడానికి వీలవుతుందని మంత్రి సూచించారు. ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సకాలంలో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఒకవేళ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లినా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని దీూా లకు సూచించారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన వారితో ఓటు హక్కు పై మంత్రి వాకిటి శ్రీహరి ప్రతిజ్ఞ చేయించారు.

## పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు చూపు

తిరుపతి : ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఖరీఫ్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐఎండీ హెచ్చరించింది. రైతులు పంటల సాగు విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంటల మార్పిడికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సమీక్ష నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కీలక సూచనలు చేశారు. జిల్లాలవారీగా నేల స్వభావం, వర్షపాతం అంచనాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక పంటల ప్రణాళిక రూపొందించారు. రాయలసీమ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉందంటున్నారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జలు, కొర్రలు, రాగుల్లాంటి పంటలు పండించాలని సూచిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేకంగా వేరుశెనగ, కంది, ఆముదం లాంటి అంతరపంటల విధానాన్ని పాటిస్తే నష్టాలు తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు. కోస్తాలోని తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ప్రధాన పంటగా వరిని సాగు చేస్తారు. నీళ్లు అందుబాటులో ఉంటేదాన్ని బట్టి స్వర్ణ, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318, బీపీటీ 5204 రకాలు సాగుచేయాలని సూచిస్తున్నారు.

## మక్తల్‌లో మంత్రి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



మక్తల్ : లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి,పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. మక్తల్ లోని మంత్రి గారి క్యాంపు కార్యాలయం లో కాంగ్రెస్ నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ..దేశంలో కులాలు మతాల పేరుతో విడగొడుతున్న తరుణంలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా 4200 కిలోమీటర్ లు నడిచి భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా ప్రజల ఐక్యత కు కృషి చేశారన్నారు. మనమేంతో మనకంత అనే నినాదంతో జిత్నే అబాది హే ఉత్నే ఇసెదరి మిల్నా చాహియే అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యం తో రాష్ట్రం లో కుల గణన చేశామని తెలిపారు. చట్ట సభల్లో ఇంకా అడుగుపెట్టని వెనకబడిన జాతులు ఉన్నాయని, వారి వెనకబాటు తనం పోగొట్టి వారిని అన్నీ రంగాల్లో ఉన్నత స్థాయి కి తెచ్చే విధంగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ కి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాలుగా శక్తిని ఇవ్వాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దేశంలో కార్ టెక్నాలజీ రోడ్డు ప్రమాదాలకు చెక్...

ముంబై : భారతదేశంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేసింది. రహదారులపై ప్రయాణించే వాహనాలు ఒకదానితో ఒకటి నేరుగా సమాచారాన్ని పంచుకునే సరికొత్త 'వాహనం-వాహనం కమ్యూనికేషన్' వ్యవస్థ అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా రోడ్డుపై వెళ్తున్న వాహనాలు ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా అనుసంధానమై ఉంటాయి. వాహనాలు తమ వేగం, ప్రయాణిస్తున్న దిశ (లొకేషన్), బ్రేకింగ్ పరిస్థితి వంటి కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీపంలోని ఇతర వాహనాలకు చేరవేస్తాయి. ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసినా, రోడ్డుపై మలుపుల వద్ద ఏదైనా వాహనం నిలిచిపోయినా.. ఈ సిస్టమ్ వెంటనే వెనుక వస్తున్న డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. వాతావరణం అనుకూలించని సమయాల్లో (పొగమంచు/భారీ వర్షం) లేదా డ్రైవర్ కంటికి కనిపించని (బ్లైండ్ స్పాట్స్) ప్రమాదాలను కూడా ముందుగానే పసిగట్టి ఇది అలర్ట్ ఇస్తుంది. దీనికోసం టెలికమ్యూనికేషన్స్ శాఖ ఇప్పటికే ఈ వాహనాల కమ్యూనికేషన్ కోసం ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీని కేటాయించడం గమనార్హం. ఈ సరికొత్త సేఫ్టీ టెక్నాలజీ భారతీయ రవాణా రంగంలో ఒక 'విప్లవాత్మక మార్పు' అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అభివర్ణించారు.

## స్కాలర్‌షిప్‌లకు నివాస ధ్రువీకరణ పత్రం అవసరం లేదు

**1.2 కోట్ల మంది విద్యార్థులకు ఊరట.. ఉమాంగ్‌లో 'సేతు' పోర్టల్ ప్రారంభం**

న్యూఢిల్లీ : షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మరింత సులభంగా అందించేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కీలక సంస్కరణలను అమలు చేసింది. స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో తప్పనిసరిగా సమర్పించాల్సిన నివాస ధ్రువీకరణ పత్రం నిబంధనను తొలగించింది.

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 1.2 కోట్ల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా స్వరాష్ట్రం వెలుపల ఇతర రాష్ట్రాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. విద్యార్థులపై పరిపాలనా భారం తగ్గడంతో పాటు సమయం, ఖర్చు కూడా ఆదా కానుంది. డిజిటల్ పాలనను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఉమాంగ్ వేదికపై 'సేతు' (స్కాలర్‌షిప్ ఫర్ ఎడ్యుకేషనల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ అప్‌లిఫ్ట్‌మెంట్) పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులు, విద్యాసంస్థల నోడల్ అధికారులు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి అధికారులు స్కాలర్‌షిప్ దరఖాస్తుల నమోదు, ధ్రువీకరణ, ట్రాకింగ్ వంటి సేవలను ఒకే వేదికపై పొందగలరు. ఈ సంస్కరణలు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విద్యార్థులకు సకాలంలో సహాయం అందించేందుకు దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## వెన్నచేడ్ పీఎం శ్రీ పాఠశాలలో నిషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం

**డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచన**

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** వెన్నచేడ్ గ్రామంలోని పీఎం శ్రీ పాఠశాలలో శుక్రవారం "నిషా ముక్త్ భారత్" (మాదక ద్రవ్యాల రహిత భారత్) మరియు డ్రగ్స్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, క్రమశిక్షణ, మంచి విలువలతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు, ఐసీడీఎస్ సూపర్వైజర్ మల్లమ్మ, అలివేలు, సఖి కౌన్సిలర్ సిరిన్, పోలీసు శాఖ ఏఎస్ఐ, గ్రామ కార్యదర్శి చెన్నకేశవులు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు "డ్రగ్స్‌కు నో చెప్పండి... ఆరోగ్యకరమైన జీవితానికి యెస్ చెప్పండి" అంటూ ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

## సమాజ్ వాదీ పార్టీ లో చీలిక తప్పదా

లక్నో : తృణమూల్ కాంగ్రెస్ లో చీలికలు, శివసేన ఉద్ధవ్ వర్గంలో చీలికలు.. తాజాగా మరో పార్టీ కూడా చీలిక దిశగా ప్రయాణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమాజ్ వాదీ పార్టీ. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వార్త పెద్ద సంచలనం రేపుతోంది. సమాజ్ వాదీ ఎంపీలంతా బీజేపీ వైపు చూస్తున్నట్లు మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ పెద్ద బాంబు పేల్చారు. దీంతో దేశ రాజకీయాలు ఆసక్తిగా మారాయి. సమాజ్ వాదీ పార్టీలో భారీ చీలిక తప్పదని, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఇప్పటికే బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధంగా వున్నారంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మహారాష్ట్రపైనే దృష్టి పెట్టొద్దని, ఇప్పుడు యూపీ వంతు వచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎవరైనా కొనుగోలు కావడానికి సిద్ధంగా వుంటేనే వారిని ఎవరైనా కొనుగోలు చేస్తారు. మహారాష్ట్ర గురించే కాకుండా యూపీ పై కూడా దృష్టి నిలపాలని మంత్రి అందులో పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి అయిన రామ్ గోపాల్ యాదవ్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఒక లేఖను అందజేశారని, ఆ లేఖ పార్టీలోని ఒక వర్గం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

# మహిళల భద్రతకు భరోసా కేంద్రం

**ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్**
**ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,**
**భరోసా కేంద్ర నిర్మాణానికి స్థల పరిశీలన**
**కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్**





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి : నాగర్ కర్నూల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన సేవలను విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ శుక్రవారం సంయుక్తంగా పరిశీలించారు. ప్రతిపాదిత స్థలంలోని భౌగోళిక పరిస్థితులు, రహదారి అనుసంధానం, భూమి విస్తీర్ణం, ప్రజలకు అందుబాటు వంటి అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం నిర్మాణానికి అవసరమైన భూమి విస్తీర్ణంపై అధికారులతో చర్చించిన కలెక్టర్, స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్లు, ప్రభుత్వ యాజమాన్య హక్కులు, మొత్తం భూమి విస్తీర్ణం, హద్దులు, సరిహద్దుల వివరాలను త్వరితగతిన అందించాలని సూచించారు. అలాగే నిర్మాణాలకు అవసరమైన మేర ప్రభుత్వ భూమిని గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పట్టణంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ అధికమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ద్వారా ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. రహదారి భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ పోలీస్ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఇక భరోసా కేంద్రం ఏర్పాటు ద్వారా మహిళలు, చిన్నారులు, లైంగిక వేధింపులు, గృహహింస వంటి సమస్యలను ఎదుర్కొంటున్న బాధితులకు ఒకేచోట సమగ్ర సహాయ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహకారం వంటి సేవలను సమన్వయంతో అందించేలా కేంద్రం పనిచేయనుందని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలకు తగినంత స్థలం కేటాయించాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అనుకూలమైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా భద్రత, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, భరోసా కేంద్రం ఏర్పాటు ద్వారా పోలీసు సేవలు మరింత ప్రజలకు చేరువ కానున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర ,రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు , నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ సురేష్ బాబు, తహసిల్దార్ తబితా రాణి, రెవిన్యూ శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పై ప్రతి కార్యకర్త అవగాహన పెంచుకోవాలి..

**ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర జరుగుతుంది..**
**బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉత్సాహంగా పని చేయాలి...**



(సమయం ప్రతినిధి దేవరకద్ర) : కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలపై ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్ధమవుతుంద రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే...కాబోయే సీఎం కేసీఆరె.నని – దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో భూత్పూర్ మండలంలోని తాటిపర్తి, కొత్తూరు,పెద్దతండా,లంబడికుంట తండా,పోతులమడుగు, శేర్పల్లి, హస్నాపూర్,అన్నసాగర్, రావులపల్లి గ్రామాల వారీగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,బూత్ ఇన్ ఛార్జ్ లతో ప్రత్యేకంగా సమావేశమై,పార్టీ సంస్థాగత నిర్మాణంపై దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( SIR ) పై ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతుందని దీనిపై అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ కార్యకర్తలను కోరారు.బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పనిచేయాలన్నారు.పార్టీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు దక్కుతుందన్నారు.పార్టీ పదవులైన...నామినేటెడ్ పదవులైన పార్టీ గెలుపు కోసం కృషి చేసే వారికే దక్కుతాయని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.సభ్యత్వ నమోదు తర్వాత ఏర్పాటు చేసుకునే కమిటీలతోనే మనం ఎన్నికలకు వెళ్తామని... అత్యంత కీలకమైన ఈ కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే స్థానం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. అసంపూర్తిగా రుణమాఫీ,రైతు భరోసా ఎగ్గొట్టి, రైతు బీమా ప్రీమియం చెల్లించకుండా, యూరియా ఇవ్వకుండా,పంట కొనుగోలు చేయకుండా రైతులను నిండా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని... హస్తం పార్టీ చేసిన మోసాల గురించి ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుందన్నారు.ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేయడంతో పాటు... సీఎం రేవంత్ రెడ్డి పాలనపై కూడా పట్టు కోల్పోయారని తెలిపారు.రెండున్నర ఏండ్లు పాలమూరు ప్రాజెక్ట్ పనులు పెండింగ్ పెట్టి... బీఆర్ఎస్ పాదయాత్ర ప్రకటనతో హడావుడి పర్యటనలు చేశారని విమర్శించారు.సీఎం పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు గానీ... కెసిఆర్ ని తిట్టడానికి మాత్రం సభపెట్టారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోయిందని...రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ని మరోసారి సీఎం చేసేందుకు ఎన్నికలు ఎప్పుడొస్తాయా అంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

# మున్సిపల్ సమస్యలపై బీజేపీ నిరసన -వినతిపత్రం



(సమయం ప్రతినిధి అమర్‌చింత) : అమర చింత మున్సిపాలిటీలోని స్థానికంగా ఉన్న సమస్యలపై మున్సిపల్ కార్యాలయం ముందు బీజేపీ కౌన్సిలర్‌ల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది..నిరసన అనంతరం బీజేపీ కౌన్సిలర్ లు అంశాల వారిగా మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ కి వినతి పత్రం అందజేశారు.వివరాలు 8వ వార్డ్ కౌన్సెలర్ మేర్వ రాజు మాట్లాడుతూలి పాలక వర్గం ఏర్పడి 4 నెలలు గడిచిన అభివృద్ధి కి నోచుకోలేదని ఇది ప్రజా పాలనా నా రాష్ట్రపతి పాలన అన్నట్టు ప్రజలు కోడై కుస్తున్నపాలక వర్గం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల ముందు హడావిడిగా మంత్రి వాకిటి శ్రీహరి 15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన లు చేసిన అవి ఇంకా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో వార్డు కౌన్సెలర్ ల శిక్షణ శిబిర కార్యక్రమంలో జిల్లా ఇ0చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పిన విధంగా ఏ పథకాలు కూడా ప్రజలు నోచుకోలేదన్నారు.మున్సిపాలిటీ లోని ప్రభుత్వ స్థలాలు గ్రామ కంఠం లో ఉన్న అవి కబ్జా కి గురి అయిన సూచిక బోర్డులు పెట్టాలని అనేక సార్లు బీజేపీ నగర శాఖ తరపున వినతి పత్రాలు ఇచిన సూచిక బోర్డు లు పెట్టలేదన్నారు. ప్రభుత్వ బీడీ దవాఖాన కోసం బీజేపీ ఆధ్వర్యంలో మరియు స్థానిక అఖిల పక్షం ఆధ్వర్యంలో స్థలం చూపించాలని వినతి పత్రం ఇచ్చిన ఇంతవరకు మున్సిపల్ అధికారులు స్తలం కేటాయించలేదన్నారు.అలాగే పోస్ట్ ఆఫీస్ భవన నిర్మాణం కి కూడా స్తలం కేటాయించాలి. బస్టాండ్ లో రోడ్ కి ఇరువైపుల చిరు వ్యాపారస్తులు వ్యాపారాలకు వీలుగా ఉండేలా మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. గత 3 యేళ్ళుగా తైబజరు విషయం లో ఎవరంతకు వాళ్ళు రసీదు లు లేకుండా వసూలు చేయడం జమ ఖర్చులు చూపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.వచ్చే మున్సిపల్ సమావేశాలలో 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టి వాటి వివరాలు అంశాల వారిగా చర్చలు జరపాలన్నారు.9వ వార్డు కౌన్సిలర్ విష్ణు మున్సిపల్ మేనేజర్ తో మాట్లాడుతూలిప్రజా పాలన లో ఎలాంటి కార్యక్రమాలు చేయాలి ఏమి అభివృద్ధి కార్యక్రమాల చేయాలనే అజెండా లేకుండా.ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రతినిధుల సమావేశం లేకుండా ఎవరంతకు వారు యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు.అదేవిధంగా 99 రోజుల ప్రణాళికల్లో ఎలాంటి జమ ఖర్చులు చేశారు ఏ పనులు చేశారని ప్రజలకు తెలియజేయాలని 9వ వార్డు తరుపున మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ కి వినతి పత్రం అందజేశారు. 10 వ వార్డు కౌన్సిలర్ పారుపల్లి ఉషన్న మాట్లాడుతూ స్తానిక 10 వ వార్డు లోని ప్రభుత్వ స్థలాలలో సూచిక బోర్డులు ఎవరి ఒత్తిడి తో పెట్టడం లేదని మేనేజర్ తో తెలియజేశారు. అదేవిధంగా మంత్రి వాకిటి శ్రీహరి గారు 15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన వాటిని ఇంతవరకు ఎక్కడ పనులు ప్రారంభించడం లేదని వెంటనే పనులు చేపట్టాలని మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నరాల నారాయణ. క్యామా భాస్కర్.దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి.మేర్వ అనిల్.తోకలి గణేష్.క్యామా నాగేష్.మంగ అనిల్.చాకలి రవి.రాకేష్.తిరుమల నరసింహ.అర్జున్ సార్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నియంత్రణకు కొత్త ఫోర్స్

హైదరాబాద్ : ప్రస్తుతం మార్కెట్‌లో ఏ వస్తువు చూసినా కల్తీమయంగా మారిపోయింది. తినే తిండి దగ్గరి నుంచి తాగే నీటి వరకు అన్నీ కల్తీలు చేస్తున్నారు. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులను కల్తీ చేసి.. కొందరు కేటుగాళ్లు భారీగా సొమ్మును వెనకేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ వస్తువులోనూ కల్తీ జాడలు ఉండటంపై సర్కార్ సీరియస్‌గా పరిగణించింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కల్తీలకు చెక్ పెట్టేందుకు ఏకంగా ఒక స్పెషల్ ఫోర్స్‌ను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిత్యావసర వస్తువుల కల్తీ ముఠాల ఆటకట్టించేందుకు ఈ స్పెషల్ ఫోర్స్ చర్యలు చేపట్టనుంది.హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆక్రమణలు, చెరువులు కుంటల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ.. పెను సంచలనం సృష్టిస్తూ.. కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా .. డ్రగ్స్, గంజాయి సహా మత్తు పదార్థాల ముఠాల పాలిట శత్రువుగా మారిన ఈగల్ ఫోర్స్ లాగానే వస్తువుల్లో కల్తీని నియంత్రించేందుకు ఒక పవర్‌ఫుల్ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది. అయితే ఈ స్పెషల్ ఫోర్స్ కేవలం తనిఖీలు మాత్రమే చేయకుండా.. కల్తీ కేటుగాళ్లపై సెర్చ్ అండ్ సీజ్ ఆపరేషన్లు నిర్వహించడం, వారికి భారీగా జరిమానాలు విధించేలా విశేషమైన అధికారాలను కట్టబెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు.రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేయనున్న ఈ స్పెషల్ ఫోర్స్‌కు ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని బాస్‌గా నియమించే ఆలోచనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి.. ఇప్పటికే సమగ్ర ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఏ రకంగా ఉక్కుపాదం మోపుతోందో.. అదే విధంగా కల్తీ దందాపైనా దూకుడుగా వ్యవహరించేలా ఈ కొత్త ఫోర్స్‌ను తయారు చేయనున్నారు.ప్రస్తుతం ఉన్న ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌లో తక్కువ మంది సిబ్బంది ఉండటంతోపాటు.. వారికి నామమాత్రపు అధికారాలు ఉండటంతో కల్తీగాళ్ల ఆటకట్టించడంలో సఫలం కాలేకపోతున్నారు. అదే సమయంలో కల్తీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని నిందితులు తప్పించుకుంటున్నారు.

# వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీలకు సన్మానం



సమయం ప్రతినిధి, పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పని పూర్తి చేసుకున్న ఎనిమిది మంది కూలీలను గ్రామ సర్పంచ్ కేళావత్ చిట్టి శంకర్ నాయక్, ఉప సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూలీలకు శాలువాలు కప్పి, స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని, కూలీలు మరింత ఉత్సాహంతో పనులు నిర్వహించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్ కేతావత్ భాస్కర్ నాయక్, కేతావత్ గేమ్యా నాయక్, ముడావత్ పీర్యా నాయక్, కేళావత్ తిరుపతయ్య నాయక్, కేతావత్ రామశీల నాయక్, ముడావత్ హర్య నాయక్, కేతావత్ సోమాని నాయక్, కేతావత్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వాడుకలోకి రాని మరుగుదొడ్లు

## అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ దుస్థితి

**బిసి పొలిటికల్ జెఎసి వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు..**




(సమయం ప్రతినిధి కొత్తకోట) మదనాపురం మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించి 8 నెలలు కావస్తున్న వాడుకలోకి రావడం లేదని బీసీ పొలిటికల్ జెఎస్సి వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బడికి నీ మహేందర్ నాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక,ప్రభుత్వ ఆసుపత్రి మధ్యలో ఉన్న ఇందిరాగాంధీ చౌరస్తా దగ్గర ప్రజలకు ఉపయోగ పడెందుకు స్తానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సహకారంతో మండలంలోని నాయకులు సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు.కట్టడాలు అయిపోయి 8 నెలలు అవుతున్నప్పటికీ కూడా అధికారులు సైతం నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తూ ఉండటం పట్ల విధుల నిర్వహణలో ఏమాత్రం పర్యవేక్షణ ఉందో తెలుస్తుందన్నారు. నిత్యం రైతు వేదిక దగ్గర సర్వసభ్య సమావేశాలు,రైతుల మీటింగులు, ప్రభుత్వ కార్యాకలాపాల కార్యక్రమాలను ఎన్నో మార్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహించినప్పటికీ.. పక్కనే ఉన్న సామూహిక మరుగుదొడ్లు ప్రజల ఉపయోగం పట్ల ఏ మాత్రం మెరుగ్గా ఉన్నాయో తెలియట్లేద అని విమర్శించారు. పురుషులకు,స్త్రీలకు విడివిడిగా మరుగుదొడ్లను కట్టి పైకి కనిపించేంత నిర్మాణాలను నాయకులు చేసినప్పటికీ కూడా వాడుకలో మాత్రం శూన్యంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. రైతు వేదిక, ఐకెపి మహిళా సమాఖ్య, ప్రభుత్వ ఆసుపత్రి,కేజీబీవీ, గోదాములు, ప్రభుత్వ పాఠశాలకు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ మరుగుదొడ్లు ఎందుకు కట్టి వదిలేసారని ప్రజలే దుమ్మెత్తి పోస్తున్నారు. ఇలా ఉంటే స్వచ్ఛ భారత్ మిషన్ కి మచ్చగా మిగులుతుందని అధికారులు ఎందుకు చెల్లించలేకపోతున్నారో గుర్తుకు రాదా అన్నారు.కేవలం కమిషన్ల పర్వం కోసమే మరుగుదొడ్లు నిర్మించారు అని విమర్శించారు. వెంటనే ఉపయోగంలోకి వచ్చేటట్లు అధికారులు చూడాలి డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ గారికి అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..

**ఎదురెదురుగా ఢీకొట్టుకున్న రెండు మారుతి కార్లు**
**ముగ్గురు మృతి, ముగ్గురికి గాయాలు**

నల్గొండ : పెద్దావూర మండలం, రామన్నగూడెంలో ఎదురెదురుగా రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జున సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం పూర్తి చేయాలి



**ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలి సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే**

**(సమయం ప్రతినిధి గద్వాల) :** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి , జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ సమావేశంలో హాజరయ్యారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూలిజిల్లాలో భూసేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగ్ లో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాజెక్టుల ఆవశ్యకత, ప్రభుత్వ అవసరాల గురించి వివరించి ఒప్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం ఆయా మండలాల వారీగా వివిధ గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై సంబంధిత మండలాల అధికారులతో క్షుణ్ణంగా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలతో విస్తరిస్తున్న భాగస్వామ్యాలు.. పెరుగుతున్న పెట్టుబడులు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : మెరుగైన ప్రపంచ నిర్మాణానికి భారత్ తన వంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచ దేశాలు విశ్వాసంతో భారత్‌తో భాగస్వామ్యాలను బలోపేతం చేసుకుంటూ, దేశంలో పెట్టుబడులు పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. '12 ఏళ్లుగా దేశమే ప్రథమం' కార్యక్రమంలో భాగంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రధాని తన అభిప్రాయాలను వెల్లడించారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రతిభ, సామర్థ్యాలు మరియు కృషి వల్లే ప్రపంచం భారత్‌ను ఆశాజనక భాగస్వామిగా చూస్తోందని ఆయన అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని, ఈ నేపథ్యంలో అనేక దేశాలు భారత్‌తో తమ వ్యూహాత్మక మరియు ఆర్థిక భాగస్వామ్యాలను మరింత విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగడం, అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కావడం దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. "మెరుగైన ప్రపంచ నిర్మాణానికి భారత్ ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటుంది. 140 కోట్ల మంది భారతీయుల శక్తి, సామర్థ్యాలే ప్రపంచానికి భారత్‌పై విశ్వాసాన్ని పెంచుతున్నాయి. అందువల్లే ప్రపంచ దేశాలు భారత్‌తో భాగస్వామ్యాలను విస్తరించుకుంటూ, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## గర్భిణీ చితాభస్మంలో బయటపడ్డ కత్తెర

**వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు**

భద్రాద్రి కొత్తగూడెం : వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు వెలుగుచూసాయి. గుండాల మండలం శంభూనిగూడెం గ్రామంలో వనజ(20) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సు సాధారణ కాన్పు చేసింది. నర్సు అవగాహన రాహిత్యం వల్ల శిశువు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మరణించింది. అయితే తల్లీబిడ్డలకు కర్మకాండ నిర్వహించాక, తల్లి చితాభస్మం సేకరిస్తుండగా అందులో శస్త్ర చికిత్సకు వాడే కత్తెర బయటపడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## విద్యా పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా కృషి చేయాలి - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్:** జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విజయలక్ష్మి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం, వంద శాతం ఉత్తీర్ణత సాధించడం, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలు ప్రతి విద్యార్థికి చేరేలా కృషి చేయాలని, పేద విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువ పారిశ్రామిక వేత్తలను తయారు చేద్దాం : ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం

**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) :** ఈరోజేనా నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి సూచించారు. శివం కన్వెన్షన్ సెంటర్ లో పారిశ్రామికవేత్తల అవగాహన, ప్రత్యేక విక్రేతల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిఐసిసిఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత తమ ఆసక్తులు, అర్హతలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ సేవలు, రిటైల్ వ్యాపారాలు, నెట్‌వర్కింగ్ సేవలు తదితర రంగాల్లో వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని, అటువంటి వారికి తోడ్పాటు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం యువత సాధికారత కోసం పలు పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన యువత వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన రుణాల కోసం బ్యాంకులు ప్రాజెక్టు నివేదికలు, విద్యార్హతలు, వ్యాపార ప్రణాళికలను పరిశీలిస్తాయని తెలిపారు. అందువల్ల యువత సరైన ప్రణాళికతో, ఆచరణ సాధ్యమైన వ్యాపార నమూనాలతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. యువతకు మార్గదర్శనం, ప్రోత్సాహం అందించి స్వయం ఉపాధి రంగంలో విజయవంతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. బ్యాంకులు సైతం ఎదిగే వారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటికే వ్యాపారంలో స్థిరపడిన పారిశ్రామిక వేత్తలకు కోట్ల రూపాయలు లోన్లు ఇస్తారు కానీ ఎదిగేందుకు అవకాశం ఉండేవారికి మాత్రం బ్యాంకులు ఆటంకం కల్పించడం ఆవేదన కలిగిస్తోందని, కానీ కొన్ని దేశాల్లో యువత లోన్లు కావాలని వస్తే వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సహాయం చేస్తాయని అన్నారు. మన దేశంలో కూడా అలాంటి అవకాశాలు ఇవ్వాలని తద్వారా యువత పారిశ్రామిక వేత్తలు గా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో యువతకు అవసరమైన శిక్షణ తరగతుల ను ఏర్పాటు చేస్తామంటే దానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, నిర్వాహకులు సీతారాం , కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

## మ్యారేజ్ పై వార్ ఎఫెక్ట్...

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో శుభకార్యాల సీజన్ మళ్లీ మొదలైంది. అధిక జేష్ట మాసం ముగిసింది. దీంతో శుభకార్యాలు మొదలయ్యాయి. జూలై 9 వరకు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సంబంధించి అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. దాదాపు నెల రోజుల తర్వాత మళ్లీ శుభకార్యాల సీజన్ మొదలైంది. ఈనెల 15 నుంచి జూలై 9 వరకు పరిమిత శుభ ముహూర్తాలు ఉండడంతో.. వివాహాలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు డిసైడ్ చేస్తున్నారు. జూలై 15 నుంచి ఆషాడమాసం, గురు మూఢం ప్రారంభం అవుతుంది. మళ్లీ ఆగస్టు 15 వరకు ముహూర్తాలు లేవు. మళ్లీ శ్రావణమాసంలోనే ముహూర్తాలు ఉన్నాయి.జూలై 9లోపు వేలాది వివాహాలు నిశ్చయం అయినట్లు తెలుస్తోంది తెలుగు రాష్ట్రాల్లో. జూన్ తో పాటు జూలై నెలలో ఈ ముహూర్తాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా జూన్ 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మరోవైపు జూలైలో 1, 6, 7, 9 తేదీలు కూడా ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు.

# మాదకద్రవ్యాల మహమ్మారిపై సమాజం సమష్టిగా పోరాడాలి: జిల్లా ఎస్పీ

**నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ**
**యువత శక్తి దేశ భవిష్యత్తు మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి**
**యువత భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత**




**(సమయం ప్రతినిధి వనపర్తి) :** మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే సామాజిక శాపం. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి యువతను సరైన మార్గంలో నడిపించాలి. ప్రజల సహకారంతో వనపర్తి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు. శుక్రవారం రోజు తెలంగాణ ప్రభుత్వం, దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ డైరెక్టర్, హైదరాబాద్ గారి ఆదేశాల మేరకు శుక్రవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జూన్ 17 నుండి 26 వరకు నషా ముక్త్ సప్తః వారోత్సవాల సందర్భంగా వారం రోజులు అవగాహన కార్యక్రమాలలో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్‌ను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, యువతను సరైన మార్గంలో నడిపించడం మరియు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావడం అత్యంత అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ,బాలాజీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి కె. సుధారాణి ,జిల్లా బాలల పరిరక్షణ అదికాకరి, రాంబాబు, జిల్లా సంక్షేమ సూపరింటెంట్ అరుంధతి, చైల్డ్ ప్రొటెక్షన్ డీసీపీయూ అధికారులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి

**(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్):** నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ,ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అనునిత్యం శ్రమిస్తున్న ,లోక్ సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు...ఈ సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసిన కాంగ్రెస్ నాయకులు...అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రారంభించడం జరిగింది...ఎందరో యువకులు,అభిమానులు,కార్యకర్తలు రక్తదాన శిబిరానికి విచ్చేసి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ,ఎ+వీఖీజ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ ,మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ,డెప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి ,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి ,గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ గారు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ ,సత్తూర్ చంద్రకుమార్ గౌడ్ ,మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు( పర్సన్ ఇంచార్జ్) గోనెల శ్రీనివాస్ గ,జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ పసుల రాజు పలు డివిజన్ల కార్పొరేటర్లు,మహిళలు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అధికారంలో ఉన్నవాళ్లను కంగారు పెడుతుందేంటీ..?

హైదరాబాద్ : సమస్యల పరిష్కారం కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్ దగ్గరకు ఎందుకు క్యూ కడుతున్నారు,,? ఇంకా మూడేళ్ళ పాలన మిగిలి ఉండగానే ఏంటీ పరిస్థితి మనం ప్రతి రోజు అర్జీలు తీసుకుంటున్నాఎందుకు ఇలా జరుగుతోంది ఎక్కడ తేడా కొడుతోంది? అంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కూటమి వర్గాల్లో ఈ తరహా చర్చలు పెరిగిపోతున్నాయట. సమస్యలు ఉంటే పరిష్కారం కోసం అధికారంలో ఉన్నవాళ్ళ దగ్గరికి రావాలిగానీ ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిని కలిసి విన్నవించుకోవడం ఏంటంటూ కూటమి నాయకులు ఆలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. ఇప్పటికి అయ్యింది.. రెండేళ్ళు మాత్రమే. ఇంకా మూడేళ్ళ పాలన మిగిలే ఉంది. అయినా సరే ఇంత త్వరగా ఎందుకు రియాక్ట్ అవుతున్నారు, వాళ్లకు జగన్ ఎందుకు గుర్తుకు వస్తున్నాడంటూ ప్రభుత్వ పెద్దలు తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. మొన్నటి దాకా అధికారంలో ఉన్న పార్టీ, ప్రస్తుతం పోరుబాట పడుతోంద కాబట్టి ఏవో చిన్నా చితకా ఇబ్బందుల గురించి చెప్పుకుంటే సరేగానీ రకరకాల సమస్యల పేరుతో బాధితులంతా వరుస బెట్టి జగన్‌ను ఎందుకు కలుస్తున్నారంటూ ఆరా తీయడం మొదలైందని చెప్పుకుంటున్నారు. ముందు అమరావతి రైతులు, తర్వాత ఆరోగ్య శ్రీ నిధులపై ఆశా యూనియన్, డీఎస్సీ 2026 పరీక్ష రాసి ఉద్యోగాలు రాని అభ్యర్థులు, రాజమండ్రి కల్తీ పాల బాధితులు, తాజాగా ఆక్వా రైతులు ఇలా సమస్యలు ఉన్నవారంతా వరుసగా జగన్‌ను కలవడం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అటు డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడుగా వెళ్తోందా.. అనే చర్చ కూడా కూటమిలో జరుగుతోందట. ప్రతి వారం.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, లోకేష్ అర్జీలు తీసుకుంటున్నారని? అదే విధంగా మంత్రులు ఎవరో ఒకరు అందుబాటులో ఉంటున్నారని..అయినాసరే ఇదేం పరిస్థితి అని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవేళ జగన్ పిలిపించుకుని మాట్లాడుతున్నారని అనుకుందామనుకున్నా.. ఇలా వరసగా అంతా వెళ్లడాన్ని మాత్రం ప్రత్యేకంగానే చూడాలంటున్నాయి కూటమి వర్గాలు. రెండేళ్ళకే పరిస్థితి ఇలా ఉంటే.. ముందు ముందు ఇంకెలా మారుతుందన్న చర్చలు సైతం నడుస్తున్నాయి. వైసీపీ నిర్వహించి వెన్నుపోటుకు రెండేళ్ళు కార్యక్రమం విజయవంతం అయిందని కూడా కూటమిలో గుసగుసలాడుకుంటున్నారట. వైసీపీ క్యాడర్ పెద్ద సంఖ్యలో బయటకు రావడం, కొన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం సక్సెస్ అవడం తమకు ఇబ్బందేనని మాట్లాడుకుంటున్నట్టు సమాచారం. ఒకవైపు ప్రతిపక్షం నిర్వహించిన కార్యక్రమం సక్సెస్ అవడం, మరోవైపు వివిధ వర్గాల బాధితులు జగన్‌ను కలవడం కూటమి నేతల్ని ఆలోచనలో పడేస్తోందట. జగన్ దగ్గరకు ఇలాగే బాధితులు క్యూ కడుతుంటే. సమస్యల పరిష్కారం సంగతి తర్వాతగానీ అసలు రాష్ట్రంలో ఇన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయా అన్న చర్చ మొదలవుతుందని, అంతిమంగా అది తమకు నష్టం చేస్తుందన్నది కూటమి నాయకుల భయంగా తెలుస్తోంది.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి : మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్







**సమయం ప్రతినిధి మహబూబ్ నగర్ :** నారాయణపేట జిల్లా కొడంగల్ రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం SIR అవగాహన సమావేశానికి మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, కొప్పుల మహేష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ జెండాను మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ఎగరవేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... పార్టీ కోసం కష్టకాలంలోనూ వెన్నంటి నిలిచిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. కేసులు, వేధింపులు ఎదుర్కొన్నప్పటికీ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తల సేవలు మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ SIR కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ప్రజాస్వామ్యంలో ఓటు ద్వారానే నిజాయితీ గల నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తోందని, దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీలలో బీఆర్ఎస్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మించారని గుర్తుచేశారు. భూమి ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ఉంటుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో పట్నం నరేందర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పార్టీకి నమ్మకంగా పనిచేసే కార్యకర్తలకు తగిన అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. అభివృద్ధితో పాటు కార్యకర్తల సంక్షేమం, గౌరవం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు, గొల్ల కురుమల అభివృద్ధి పథకాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులు, మహిళలు, బలహీన వర్గాల సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు, అత్యాచారాలు, పోక్సో కేసులు పెరుగుతున్నాయని, శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్ లీడర్లు జానా రెడ్డి, జైపాల్ రెడ్డి వంటి వారు ముఖ్యమంత్రి కాలేక పోయారు. కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాము కాబట్టే ఈ రోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలన్నారు. స్వంత జిల్లాకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులను ఆపి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# నక్ష సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తాం

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతాం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి:** నక్ష సర్వే, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న వినతులు, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., జిల్లాలో రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే కార్యక్రమాన్ని నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. గ్రామాలు, మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సాధించి, సర్వే నిర్వహణకు అవసరమైన పరికరాలు, సాంకేతిక సామగ్రి, ఇతర వసతులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమకూర్చుకునే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కారమయ్యేలా జిల్లాలో చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను కూడా పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. నక్ష సర్వే, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి వినతులు, రెవెన్యూ సదస్సులలో అందిన ఫిర్యాదులు, భూ రికార్డుల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి అధికారులకు స్పష్టమైన మరింత కఠినమైన ఆదేశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడం రెవెన్యూ శాఖ ప్రధాన లక్ష్యంగా జిల్లాలో జిల్లా రెవిన్యూ యంత్రాంగం కృషి చేయనున్నట్లు తెలిపారు.

# నోరు తెస్తున్న తంటా తలనొప్పిగా మారుతున్న రేవంత్ మాటలు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమర్థుడైన వ్యూహకర్త, అంతకుమించి అద్భుతమైన వాగ్ధాటి గల నేత అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నా, తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినా.. ప్రత్యర్థులపై తన మాటల ఈటెలతో విరుచుకుపడటంలో ఆయన శైలే వేరు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ చాతుర్యానికి, వాక్చాతుర్యానికి సమతూగగల ఏకైక నేతగా రేవంత్ రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు, ప్రసంగాలు ఊహించని విధంగా మిస్ ఫైర్ అవుతూ సొంత పార్టీకే ఇరకాటాన్ని తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దూకుడు స్వభావంతో ప్రత్యర్థులను అణచివేయాలని చూసే క్రమంలో కొన్నిసార్లు వివాదాస్పద పోలికలను తెరపైకి తెస్తున్నారు. హైడ్రా విషయంలో హిట్లర్ ప్రస్తావన తీసుకురావడం జాతీయ స్థాయిలో కలకలం రేపింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి, క్రూరత్వానికి మారుపేరైన హిట్లర్ స్ఫూర్తిగా హైడ్రాను ఏర్పాటు చేశానని చెప్పడం అటు ప్రతిపక్షాలు, ఇటు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అధిష్టానం సైతం అప్రమత్తమై నష్టనివారణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది. చివరికి ఈ వ్యాఖ్యలపై సీఎం వివరణ ఇచ్చుకుంటూ నాలిక్కరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా మాట్లాడే క్రమంలో రేవంత్ రెడ్డి కొన్నిసార్లు ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వివాదాన్ని రాజేస్తున్నారు. కేంద్ర నిధుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం వరకు సరే.. కానీ, దానిని తీవ్రమైన ప్రాంతీయ వాదంగా మార్చడం వల్ల ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ పార్టీగా దేశవ్యాప్తంగా ఓట్లు రాబట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తోంది. ప్రాంతీయ పార్టీల తరహాలో సీఎం మాట్లాడటం జాతీయ పార్టీ సిద్ధాంతాలకే సమస్యగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటల్లో అత్యంత వివాదాస్పదమైనది బీహార్ వలస కార్మికులు, అక్కడి నేతలపై చేసిన వ్యాఖ్యలు. బీహారీ డీఎన్ఏ ను ప్రస్తావిస్తూ ఆయన చేసిన కామెంట్స్ జాతీయ మీడియాలో హెడ్‌లైన్స్‌గా మారాయి. ఈ వ్యాఖ్యలతో అటు బీహార్‌తో పాటు ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ మిత్రపక్షాలైన ఆర్జేడీ, జేడీయూ వంటి పార్టీలు కూడా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమిని బలోపేతం చేయాలని మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రయత్నిస్తుంటే.. రేవంత్ వ్యాఖ్యలు ఆ కూటమి ఐక్యతనే దెబ్బతీసేలా ఉన్నాయని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకున్నారు. తెలంగాణ సరిహద్దులు దాటి పక్క రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కూడా రేవంత్‌కు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరాన్ని ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో దుమారం రేపాయి. తెలంగాణ అభివృద్ధిని చూపిస్తూ పొరుగు రాష్ట్రాన్ని తక్కువ చేసి మాట్లాడటం వల్ల ఏపీలోని కాంగ్రెస్ క్యాడర్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే ఏపీలో ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు మరింత నష్టం చేకూరుస్తున్నాయని అక్కడి నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేసే వరకు పరిస్థితి వెళ్లింది. రేవంత్ రెడ్డి కంఫర్ట్ జోన్ ఎప్పుడూ తెలంగాణ సెంటిమెంట్, రైతులు, పేదల సంక్షేమం, కేసీఆర్ మార్క్ పాలనపై విమర్శల చుట్టూనే ఉంటుంది.

## రేవంత్ ట్రాప్‌లో కిషన్

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిల మధ్య సాగుతున్న మాటల యుద్ధం కేవలం పైకి కనిపిస్తున్న రాజకీయ విమర్శ మాత్రమే కాదు.. దాని వెనుక అత్యంత వ్యూహాత్మకమైన, లోతైన పొలిటికల్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ దాగుంది. కేంద్రంలో క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న కిషన్ రెడ్డిని రేవంత్ రెడ్డి పదే పదే టార్గెట్ చేయడం, ఆయనపై బీఆర్ఎస్ ముద్ర వేయడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నారు. సాంకేతికంగా చూస్తే కిషన్ రెడ్డికి కేటీఆర్ మాట వినాల్సిన అవసరం అస్సలు లేదు. కిషన్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్నారు, పైగా రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే సీఎం రేసులో ఉండే అత్యంత సీనియర్ నేత. అయినప్పటికీ, రేవంత్ రెడ్డి ఆయనను కేటీఆర్ చెప్పినట్లే ఆడుతున్నారు అని విమర్శించడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడుతున్న తరుణంలో, కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోంది. ఈ తరుణంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని, వాటి మధ్య చీకటి ఒప్పందం ఉందనే భావనను ప్రజల్లో బలంగా నాటడం ద్వారా రెండు పార్టీలను ఒకే దెబ్బకు బలహీనపరచాలనేది రేవంత్ రెడ్డి పొలిటికల్ ప్లాన్. ఇక పరిపాలనా కోణంలో చూస్తే.. రేవంత్ రెడ్డి ఇక్కడ అత్యంత చాకచక్యంగా రివర్స్ సైకాలజీ ని ప్రయోగిస్తున్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెద్ద ప్రాజెక్టుల అనుమతులు కేవలం సామరస్యపూర్వక చర్చలతో రావడం లేదని రేవంత్ భావిస్తున్నారు. అందుకే, తెలంగాణకు చెందిన ఏకైక కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి.. ఆయనే ఢిల్లీలో ఒత్తిడి తెచ్చి మన ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు అని పబ్లిక్‌గా నిందలు వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కిషన్ రెడ్డి డిఫెన్స్‌లో పడతారు. తనపై పడ్డ తెలంగాణ ద్రోహి అనే నిందను తొలగించుకోవడానికి అయినా, కిషన్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకుని ఢిల్లీ పెద్దలతో మాట్లాడి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తీసుకురావాల్సిన పరిస్థితిని రేవంత్ కల్పిస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల రీఫైనాన్సింగ్ లోన్, ఎన్ఓసీ వ్యవహారంలో ఈ వ్యూహం స్పష్టంగా కనిపించింది. మెట్రో ప్రాజెక్టు టేకోవర్ , లోన్ మంజూరులో కొన్ని సాంకేతిక ఇబ్బందులు, కేంద్ర-రాష్ట్రాల మధ్య నిబంధనల పేచీలు వచ్చాయి. అయితే రేవంత్ రెడ్డి ఆ సాంకేతిక సాకులను పక్కనపెట్టి.. కిషన్ రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ లోన్ రాకుండా అడ్డుకున్నారని, దీని వెనుక కేటీఆర్ కుట్ర ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. దీనివల్ల సాంకేతిక లోపం కాస్తా, రాజకీయ వివాదంగా మారి.. కిషన్ రెడ్డి ఆ లోన్ క్లియర్ చేయించాల్సిన నైతిక ఒత్తిడిలోకి వెళ్లారు. ఈ మైండ్ గేమ్‌లో రేవంత్ రెడ్డి విన్-విన్ పొజిషన్‌లో ఉన్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల ఒత్తిడికి లొంగి, కిషన్ రెడ్డి ఢిల్లీలో మాట్లాడి మెట్రో లోన్ ఎన్ఓసీ లేదా నిధులు ఇప్పించారనుకోండి.. చూశారా, మేము నిలదీస్తేనే ఢిల్లీ దిగొచ్చింది, ప్రాజెక్టు సాధించాం అని కాంగ్రెస్ క్రెడిట్ కొట్టేస్తుంది. అలా కాకుండా కేంద్రం మొండికేసి లోన్ ఆపేస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ కలిసే హైదరాబాద్ అభివృద్ధిని, మెట్రో విస్తరణను అడ్డుకున్నాయి అని రాబోయే ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పొలిటికల్ మైలేజ్ సాధించవచ్చు. ఎలా చూసినా కిషన్ రెడ్డిని రేవంత్ తన వ్యూహాత్మక పద్మవ్యూహంలో బంధించేశారు. కేవలం మెట్రో మాత్రమే కాదు.. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ నిధుల విషయంలోనూ రేవంత్ రెడ్డి ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ను అద్భుతంగా చెప్పుకునే బీజేపీ నేతలు, హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని రేవంత్ ప్రశ్నిస్తున్నారు.

# ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలి

## -జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి

**వనపర్తి, సమయం ప్రతినిధి :** జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతం చేయడానికి బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్ లకు పకడ్బందిగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి తెలియజేశారు. ఎస్.ఐ.ఆర్ నిర్వహణ పై శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎలెక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎలక్టోరల్ అధికారి వివరిస్తూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పారదర్శకంగా ఎలాంటి తప్పులు లేకుండా సజావుగా నిర్వహించడానికి బి.ఎల్. ఒ లు, బి.ఎల్.ఎ ల పాత్ర చాలా కీలకమని, అందువల్ల ప్రతి బి.ఎల్ ఒ కు, బి.ఎల్. ఎ కు పకడ్బందీగా శిక్షణ ఇచ్చి ఎలాంటి అనుమానాలు లేకుండా నివృత్తి చేయాలని కలెక్టర్లను సూచించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమావేశం నిర్వహించి ఎస్.ఐ.ఆర్ పై అవగాహన కల్పించి అనుమానాలు నివృత్తి చేయాలని సూచించారు. అందరూ బి.ఎల్ ఒ లు., బి.ఎల్.ఎ లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం ఏవిధంగా పూరించాలి, ప్రధానంగా వచ్చే సమస్యలు ఏంటి వాటిని ఎలా పరిష్కరించాలి అనే విషయాలు బాగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్. ఐ ఆర్ జరుగుతున్న రోజుల్లో వారంలో ఒకరోజు బి.ఎల్.ఒలు, బి.ఎల్.ఎలకు సమావేశం నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వివరిస్తూ వనపర్తి జిల్లాలోని బి.ఎల్ ఓ లు, రాజకీయ పార్టీలు ఎంపిక చేసిన బి.ఎల్. ఎ లకు మండలాల వారిగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొన్ని మండలాలు పూర్తి అయ్యాయని మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని వివరించారు. బి.ఎల్. ఒ, లకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఇప్పటికే మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ టి.వినోద్ కుమార్, డి.ఆర్.ఒ సూర్యప్రకాష్, ఆర్డీఓ సుబ్రమణ్యం, సి. సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు వి.సి. లో పాల్గొన్నారు.






టాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి ప్రస్తుతం హీరోగా కొనసాగుతోన్న విషయం తెల్సిందే. కోర్ట్ సినిమాతో మంచి హిట్ అందుకున్న ప్రియదర్శి ఆ తరువాత కొన్ని సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. అయితే ఈసారి ఎలాగైనా మంచి హిట్ అందుకోవాలని చూస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ప్రియదర్శి హీరోగా సరికొత్త చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంతో వంశీ రెడ్డి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం కాబోతుండగా.. సుకుమార్ రైటింగ్స్ తో కలిసి బన్నీ వాస్ నిర్మిస్తున్నాడు. ఇక ఈ సినిమాతో ప్రముఖ జానపద గాయని, డాన్సర్ నాగదుర్గ హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనుంది. ఫోక్ స్టార్ గా నాగదుర్గకు ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ మధ్యనే ఈ చిన్నది తమిళ్ లో కూడా హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. లవ్.. ఓ లవ్ అనే సినిమాలో ఆమె హీరోయిన్ గా చేస్తోంది. ధనుష్ దర్శకత్వం వహించిన జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాలో హీరోగా నటించిన పవిష్ నారాయణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఈ సినిమా ఇంకా రిలీజ్ కాకముందే నాగదుర్గ తెలుగులో కూడా హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వబోతుంది. ఇప్పటికే తెలుగులో కలివి వనం అనే సినిమాలో నటించింది. కానీ, పెద్ద బ్యానర్ లో మొదటిసారి నటించబోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఫోక్ సింగర్ నాగదుర్గ రెండోసినిమానే సుకుమార్ రైటింగ్స్ వంటి ప్రతిష్టాత్మక బ్యానర్‌లో అవకాశం రావడం టాలీవుడ్‌లో పెద్ద సంచలనంగా మారింది. సుకుమార్ కథల్లో హీరోయిన్ క్యారెక్టర్స్ ఎంత పవర్‌ఫుల్‌గా, నేటివిటీతో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు నాగదుర్గ లాంటి ఒక లోకల్ టాలెంట్‌ని మెయిన్ లీడ్‌గా పెట్టడం వెనుక దర్శకుడు వంశీ రెడ్డి ఒక అద్భుతమైన పల్లెటూరి నేపథ్యమున్న కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ప్రియదర్శి, నాగదుర్గ కాంబినేషన్ స్క్రీన్ పై సరికొత్త మ్యాజిక్ క్రియేట్ చేయబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. మరి తెలుగు, తమిళ్ భాషల్లో ఈ ఫోక్ స్టార్ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.




టాలీవుడ్ హీరో నితిన్ గత కొన్నేళ్లుగా ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. కానీ, ఇప్పటివరకు ఒక్క హిట్ కూడా అందుకోలేకపోయాడు. గతేడాది రాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ప్రేక్షకులను మెప్పించలేకపోయాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడులా మంచి హిట్ కోసం కష్టపడూతూనే ఉన్నాడు. అందులో భాగంగానే సితార ఎంటర్ టైన్మెంట్స్ లో నితిన్ ఒక సినిమా చేస్తున్నాడు. కొత్త డైరెక్టర్ నారి సిరిస్వాద, సోమశేఖర్ టి దర్శకులుగా పరిచయం అవుతున్నారు.

నితిన్ 43 గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఈమధ్యనే పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ సినిమాలో నితిన్ సరసన రితికా నాయక్ నటిస్తోంది. మిరాయ్ సినిమాతో పాన్ ఇండియా లెవెల్ లో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. టాలీవుడ్ కి లక్కీ బ్యూటీగా మారింది. దీంతో నితిన్ ఈసారి మంచి హిట్ నే అందుకుంటాడు అనుకున్నారు. అయితే ఏమైందో ఏమో తెలియదు కానీ.. రితికా ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీలో సినిమా రిలీజ్ అయ్యేవరకు ఎవరు ఉంటారో ఎవరో పోతారో చెప్పడం చాలా కష్టం. ఇక సినిమా మొదలైన కొన్ని రోజులుకే నితిన్ సినిమా నుంచి రితికా తప్పుకుందంట. ఇప్పుడు ఆమె ప్లేస్ ని బేబీ బ్యూటీ వైష్ణవి చైతన్య రీప్లేస్ చేయనుందని సమాచారం. కథలో జరిగిన కొన్ని మార్పులు, డేట్ల అడ్జస్ట్‌మెంట్స్ కారణంగా రితికా తప్పుకోవడంతో ఆ ఛాన్స్ బేబీ పట్టేసిందని అంటున్నారు. ఏదిఏమైనా వైష్ణవికి ఇది పెద్ద ప్రాజెక్టు అని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని సమాచారం. మరి ఈ సినిమాతో నితిన్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




కుర్ర హీరో విరాట్ కర్ణ, నభా నటేష్ జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-మైథోలాజికల్ థ్రిల్లర్ నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్. ప్రముఖ నిర్మాణ సంస్థ అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ విజువల్ వండర్ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహించాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. నాగబంధం సినిమా కథ మొత్తం కొన్ని వందల ఏళ్ల నాటి ఒక ప్రాచీన రహస్యం చుట్టూ తిరుగుతుంది. ఈ సృష్టిలోనే అత్యంత శక్తివంతమైన, దైవిక మహిమలు గల బ్రహ్మకమలం ఒక రహస్య ప్రదేశంలో దాచబడి ఉంటుంది. దానికి నాగసాధువులు రక్షణ కవచంగా ఉంటారు. దురాశతో ఆ నిధిని ఎలాగైనా దక్కించుకోవాలని చూసే విలన్ల ముఠా ఒకవైపు.. ఆ రహస్యాన్ని ఛేదించి, దైవ నిధిని రక్షించడానికి హీరో ఒకవైపు. చివరికి బ్రహ్మకమలం ఎవరి చేతికి వెళ్ళింది.. ? అసలు దానికి ఉన్న శక్తులు ఏంటి.. ? దానికి నాగబంధనం వేసింది ఎవరు.. ? ఇవన్నీ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ట్రైలర్ లోని ప్రతి విజువల్ మైండ్ బ్లోయింగ్ గా ఉంది. ప్రారంభంలోనే దట్టమైన అడవులు, ఎవరూ వెళ్లలేని లోయలు, ఒక పురాతనమైన భారీ నల్లరాతి కోటను చూపిస్తూ బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే వాయిస్ ఓవర్ సినిమాపై ఒక్కసారిగా క్యూరియాసిటీని పెంచేస్తుంది. ముఖ్యంగా ఆ దైవ నిధికి రక్షణగా ఉండే నల్లటి భారీ పాములు ఒక విజువల్ ఎఫెక్ట్ సీన్ చాలా రా అండ్ రస్టిక్ గా, భయపెట్టేలా ఉన్నాయి. గ్రాఫిక్స్ క్వాలిటీ నెక్స్ట్ లెవెల్ లో ఉంది. ఇక చివర్లో వచ్చే హై-వోల్టేజ్ క్లైమాక్స్ షాట్, విరాట్ కర్ణ యాక్షన్ సీక్వెన్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. విజువల్ వండర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు ప్రధాన బలం జునైద్ కుమార్ మ్యూజిక్. ట్రైలర్ తోనే సినిమాపై హైప్ పెంచేశారు. ఈ ట్రైలర్ కట్ కూడా చలా అద్భుతంగా చేశారు.

## Cinema




నేచురల్ స్టార్ నాని , టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా మూవీ 'ది ప్యారడైజ్'. దసరా లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కాంబోలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక ఈ చిత్రంలో మోహన్ బాబు, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ విలన్స్ గా నటిస్తున్నారు. కయాదు లోహార్ హీరోయిన్ గా నటించింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, వీడియోస్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఒక క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రం నుంచి రాఘవ్ జుయల్ క్యారెక్టర్‌ను పరిచయం చేశారు. కేవలం 40 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్‌లో రాఘవ్ జుయల్ మోస్ట్ వయలెంట్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపించి అందరినీ సర్ప్రైజ్ చేశాడు. ఖాన్దాన్ కీ శాన్.. దోస్తోం కీ జాన్.. విక్రమ్ మాలిక్ కా స్వాగత్ హై అంటూ వచ్చే డైలాగ్స్, రాఘవ్ జుయల్ సిగరెట్ కాలుస్తూ ఇచ్చే ఎంట్రీ ఎలివేషన్స్ సినిమాలో ఆయన విలనిజం ఏ రేంజ్‌లో ఉండబోతోందో స్పష్టం చేస్తున్నాయి. దీనికి తోడు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విజువల్స్‌ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. శ్రీకాంత్ ఓదెల మార్క్ రా అండ్ రస్టిక్ టేకింగ్ ఈ చిన్న వీడియోలోనే స్పష్టంగా కనిపిస్తోంది. ఇక చరిత్ర లో అందరూ చిలకలు పావురాలు గురించి రాసిండురే.. కాకి గురించి ఎవరూ రాయలేదు అని గ్లిమ్స్ లో చూపించారు. నాని.. కాకి, మోహన్ బాబు చిలుక.. రాఘవ్ పావురం అని శ్రీకాంత్ చెప్పేశాడు. ఇందులో మోహన్ బాబు శిఖంజా మాలిక్ గా కనిపించనున్నారు. ఆయన కొడుకుగా రాఘవ్ కనిపించనున్నాడు. ఇక విక్రమ్ మాలిక్ లుక్ తో సినిమాపై హైప్ మరింత పెరిగింది. వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ప్యారడైజ్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి.




యంగ్ ట్యాలెంటెడ్ శ్రీతేజ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాంబో'. రత్నాకరం అనిల్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని, 'హిడింబ' వంటి భిన్నమైన చిత్రాన్ని అందించిన నిర్మాత గంగపట్నం శ్రీధర్ నిర్మిస్తున్నారు. తాజా గా చిత్ర బృందం విడుదల చేసిన 'రాంబో' గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు పెంచింది. 'ఒక మృగం మనిషిగా పుడితే వాడే రాంబో' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన గ్లింప్స్ వైల్డ్ యాక్షన్‌తో ఆకట్టుకుంది. శ్రీతేజ్ ఇంటెన్స్, అగ్రెసివ్ బాడీ లాంగ్వేజ్‌తో పాత్రలో పూర్తిగా ఒదిగిపోయాడు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో అతను చూపించిన వైల్డ్ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత బలంగా నిలబెట్టాయి. దర్శకుడు రత్నాకరం అనిల్ రాజు రాంబో పాత్రను డిజైన్ చేసిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరో క్యారెక్టర్‌లోని వైల్డ్ ఎమోషన్స్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. సినిమా టోగ్రాఫర్ శ్యామ్ కె. నాయుడు అందించిన విజువల్స్ గ్లింప్స్ కు పర్ఫెక్ట్ లుక్ తీసుకొచ్చాయి. ప్రతి ఫ్రేమ్ కథలోని ఇంటన్సి టీ మరింత బలంగా కనిపించింది.

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత
దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో,
మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి
ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం
60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం
జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా
సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో
పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085